

కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా చంద్రలీల

● టీజీపీ స్పెషల్ కలెక్టర్ పీఏగా మురళి

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : జిల్లా కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బి. చంద్రలీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ ఏ. మురళీని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ పీఏగా, డిప్యూటీ కలెక్టర్ బి.మహేశ్వరరెడ్డిని నెల్లూరులోని జీజీహెచ్ పరిపాలనాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం..

బడుల్లో పండుగ

- వచ్చే నెల 7న మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం
- విద్యాపరమైన అంశాలపై చర్చ
- ఆటల పోటీలు, సహపంక్తి భోజనాలు
- జిల్లాకు రూ.48 లక్షల మంజూరు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చనుంది. విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, శుభతిధి పేరుతో సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందచేయనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు శుభతిధి పేరుతో వచ్చే నెల 7వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

6

నేటి నుంచే పింఛన్ల పంపిణీ

1వతేదీ ఆదివారం కావడంతో ముందే..!

మిగిలిన వారికి సోమవారం అందజేత

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెలా 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పేరుతో అందిస్తున్న సామాజిక పింఛన్లను డిసెంబరు నెలకు సంబంధించి నవంబరు 30 నుంచే పంపిణీ చేయనుంది. 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ముందురోజే పెన్షన్లను అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ముందస్తుగా నిధుల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. ఇదిలా ఉండగా ఎవరైనా పింఛనుదారులు వివిధ కారణాలతో వరుసగా రెండు నెలలు అందుబాటులో ఉండకపోతే మూడో నెలలో మొత్తం మూడు మాసాల పింఛను పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ విధానం అమలులో ఉన్నప్పటికీ ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని రద్దు చేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఆ విధానాన్ని పునరుద్ధరించింది. మొదటి వారంలో ఊర్లకు వెళ్లేవారు, వలస కార్మికులకు ఈ విధానంతో మేలు జరగనుంది. కాగా, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 3,09,997 మందికి రూ.131.62 కోట్లను పెన్షన్‌గా ప్రభుత్వం అందిస్తోంది. ఈ పింఛన్ల పంపిణీకి సుమారు 7 వేల మంది సచివాలయ సిబ్బందిని వినియోగిస్తోంది. వారు శనివారం ఉదయం 6 గంటలకే పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేసేలా ఏర్పాట్లు చేసింది. తొలిరోజు పింఛను అందని వారికి డిసెంబరు 2వ తేదీ సోమవారం పెన్షన్ పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. ఎవరైనా వరుసగా మూడు నెలలు పింఛను తీసుకోకపోతే వారి పెన్షన్ రద్దవుతుందని పేర్కొన్నారు.



ఊరట

- మధ్యాహ్న భోజనం ధరల పెంపు
- రేపటి నుంచి అమలులోకి..
- నిర్వాహకుల్లో ఆనందం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కేంద్ర ప్రభుత్వం తీయటి కబురు అందించింది. ఒకటవ తేదీ నుంచి ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది. జిల్లాలో 2,040 ప్రాథమిక పాఠశాలల్లో 65,109 మంది, 220 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 20,820 మంది, 336 ఉన్నత పాఠశాలల్లో 1,03,150 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం రూ.5.45 చొప్పున ఇస్తుండగా దానిని రూ.6.19లకు పెంచారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రూ.8.17 ఇస్తుండగా, దీనిని రూ.9.26 చొప్పున చెల్లించనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరించాల్సి ఉంటుంది. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 498 మంది విద్యార్థులు ఉండగా, నెలకు సుమారు రూ.40 వేల వరకు మధ్యాహ్న భోజనానికి ఖర్చు అవుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు పెరిగిన ధరలతో ఈ కష్టాలు తొలగి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందనుంది.



- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)

జీజీహెచ్‌లో తక్కువ ధరకే స్కానింగ్

- అడ్మిట్ రోగులకు ఉచితం
- అవుట్ పేషెంట్లకు మాత్రం తక్కువ రేటుకే!



జీజీహెచ్‌లో స్కానింగ్ సెంటర్

నెల్లూరు (వైద్యం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో (జీజీహెచ్) అతి తక్కువ ధరకే ఎమ్మార్, సిటీ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు జీజీహెచ్ రోగులే కాదు.. బయటివాళ్లకు కూడా పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్) పద్ధతిలో అవకాశం కల్పించారు. ఇది ఎప్పటినుంచో ఉన్నా చాలామందికి ఈ విషయం తెలియక ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు పరీక్షలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్లో బ్రెయిన్ పెయిన్ ఎంఆర్ఐకు రూ.5,500 ఖర్చు అవుతుండగా జీజీహెచ్‌లో మాత్రం రూ.2,660లకే చేస్తున్నారు. రూ.6వేలు విలువ చేసే ఆర్బిట్ పరీక్షను కూడా రూ.2,660లకే చేస్తుండటం గమనార్హం. మరోవైపు ప్రైవేట్ వైద్యులు కూడా జీజీహెచ్‌లో ఎమ్మార్, సిటీస్కాన్ ఉందని అక్కడ తీయించుకో వచ్చని రోగులకు చెప్పడం లేదు. ఇందుకు ఆయా స్కానింగ్ కేంద్రాలలో వైద్యులకు కమీషన్ రూపంలో కొంత నగదు ముడుతుండటమే ఇందుకు కారణం. మరోవైపు కొందరు ప్రభుత్వ వైద్యులు కూడా జీజీహెచ్ స్కానింగ్ కేంద్రానికి వెళ్లమని సూచించటం లేదు. దీంతో బాధితుల జేబులకు చిల్లు పడక తప్పటం లేదు. కాగా, జీజీహెచ్‌లో అడ్మిట్ అయిన రోగులకు మాత్రం ఈ స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు.

రేడియాలజిస్టుల కొరతతో ..

జీజీహెచ్‌లో ఇద్దరు రేడియాలజిస్టులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో ఇక్కడ ఎమ్మార్, సిటీస్కాన్‌ను రోజుకు 50 మందికి మాత్రమే చేస్తున్నారు. రోగుల అవసరాలకు అనుగుణంగా కనీసం ఐదుగురు రేడియాలజిస్టులు అవసరమని సూపరింటెండెంట్ డీఎంఈకి ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ భర్తీ చెయ్యలేదు. ప్రస్తుతం ఈ కేంద్రం ఐపీఎంఎస్ ఐడీసీ నిర్వహణలో నడుస్తోంది.

జీజీహెచ్, ప్రైవేటు కేంద్రాలలో స్కానింగ్ ధరలు (రూ.లలో)

పరీక్ష	ప్రైవేట్	జీజీహెచ్
బ్రెయిన్ పెయిన్ ఎంఆర్ఐ	5,500	2660
బ్రెయిన్ పెయిన్, కాంట్రాక్టు	8,000	3,460
హోల్ అబ్డామిన్	5,000	2,660
థొరాక్స్ /చెస్ట్	5,500	2,660
పీఎన్ఎస్, నెక్	5,000	2,660
ఆర్బిట్	6,000	2,660
పిట్యూటరీ ఫోసా	6,000	2660
టెంపోరల్ బోన్	6.000	2,660
జాయింట్ (ఎనీవన్)	5500	3,045
మస్కిలోస్కెలిటల్	6,000	2,820
స్పైన్	5,500	2,660
సీటీస్కాన్	3,500	839
(ఫిల్మ్‌కు రూ.200 అదనం)		

అందరూ సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆసుపత్రులలోని రోగులే కాకుండా బయట పలు ఆసుపత్రులలోని రోగులు కూడా పీపీపీని సద్వినియోగం చేసుకోవచ్చు. ఎంఆర్ఐ, సీటీస్కాన్ అందుబాటులోకి వచ్చినా తగినంత మంది రేడియాలజిస్టులు లేరు. దీనివల్ల రిపోర్టులలో ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం వెంటనే రేడియాలజిస్ట్ ఖాళీలను భర్తీ చేయాలి.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

విద్యాశాఖలో అధికారుల బదిలీలు

నెల్లూరు (విద్య ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులను బదిలీ చేస్తూ డైరెక్టర్ వి.విజయరామ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు డిప్యూటీ ఈఓగా పనిచేస్తున్న కె.ప్రసన్నలక్ష్మిని డీఈవో కార్యాలయం ఏడీగా, కావలి డిప్యూటీ ఈఓ పి.రఘురామయ్యను, ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్‌ను స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న టి.విజయ్‌కుమార్‌ను కడప జిల్లా ఆర్జేడీ కార్యాలయ ఏడీగా నియమించారు. అలాగే సమగ్రశిక్షలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఓవీఎస్.అనిల్‌కుమార్‌ను డిప్యుటేషన్‌పై గుంటూరు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే విధుల్లో చేరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈగల్‌తో ఆగేనా!?

గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)ను రంగంలోకి దించుతోంది. ఇప్పటికే అమరావతిలో రాష్ట్రస్థాయి నార్కోటిక్స్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయగా జిల్లా స్థాయిలో నెల్లూరులోనూ ఈగల్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో విచ్చల విడిగా గంజాయి విక్రయాలు జరిగాయి. ఇతర రాష్ట్రాలకు జిల్లా మీదుగా పెద్ద సంఖ్యలో సరుకు రవాణా జరిగేది. ఆఖరికి చిల్లర అంగళ్లలోనూ గాంజా దొరికే స్థాయికి పరిస్థితులు చేరుకున్నాయి. వ్యాపారులు పంథా మార్చి సేల్స్‌మెన్ ఏర్పాటు చేసుకుని మరీ యువతను వ్యసనపరులుగా మారుస్తున్నారు. సులభంగా మత్తు లభిస్తుండటంతో ఆకర్షితులైన విద్యార్థులు వాటికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇక జిల్లాలో జరిగే నేరాల్లో అధికానికి గంజాయే ప్రధాన కారణమని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈగల్ విభాగం గంజాయి ముఠా పీచమణిచేలా పనిచేయాలని జిల్లావాసులు ఆశిస్తున్నారు.





నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థుల జీవితాల్లో గంజాయి విష వృక్షంలా మారుతోంది. ఎంతో మంది ఆ మత్తుకు బానిసలుగా మారుతున్నారు. గంజాయి విక్రయదారులు కూడా యువతనే లక్ష్యంగా చేసుకుని వారిని మత్తులో దించి జేబులు నింపుకుంటున్నారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మత్తుకు ఎక్కువగా బానిసలవుతున్నారని సమాచారం. ఆయా కళాశాలల యాజమాన్యాలకు ఈ విషయం తెలిసినా తల్లిదండ్రులకు చెప్పి ఊరుకుంటు న్నారేగానీ పోలీసులకు ఫిర్యాదు వరకు వెళ్లడం లేదు. విద్యాసంస్థలకు చెడ్డ పేరు వస్తుందన్న భావనతో మత్తు విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ఇది పరోక్షంగా గంజాయి వ్యాపారులకు ధైర్యాన్నిస్తోంది.

● సేల్స్‌మెన్‌తో వ్యాపారం

గంజాయి వ్యాపారులు కొత్త పంథాను ప్రారంభించారు. విశాఖపట్నం పరిసర ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి రైలు, రోడ్డు మార్గాల్లో జిల్లాకు చేరుతోంది. అలా వచ్చిన దానిని టోకు వ్యాపారులు కేజీ రూ.5 వేలకు దిగుమతి చేసుకుంటున్నారు. ఆ తర్వాత కిందిస్థాయి వ్యాపారులకు కేజీ రూ.8 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. ఆ వ్యాపారులు గతంలో 20 గ్రాములు, 50 గ్రాముల ప్యాకెట్లు తయారు చేసి గంజాయి బానిసలకు విక్రయించేవారు. అయితే ప్రస్తుతం వ్యాపార శైలిని మార్చేశారు. యువత, విద్యార్థులే లక్ష్యంగా సేల్స్‌మెన్‌ను ఏర్పాటు చేసుకొని బిజినెస్ పెంచుకుంటు న్నారు. ఒక్కో గంజాయి ప్యాకెట్‌పై కమీషన్‌తోపాటు నెలవారి జీతాలు కూడా ఇస్తున్నారు. ఆ సేల్స్‌మెన్ కళాశాలలు, పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, సినిమా థియేటర్లు, కేఫ్‌లు, బార్లు, మద్యం దుకాణాలు, క్రీడా మైదానాల్లో ఉండి సిగిరెట్లు, మద్యం సేవించే వారికి గంజాయి శాంపిల్ ప్యాకెట్లను ఫ్రీగా ఇచ్చి మత్తును అలవాటు చేస్తున్నారు. వారు బానిసలుగా మారిన తర్వాత గంజాయిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ విధంగా కేజీకి రూ.15 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు తెలిసింది.

● ఇంటర్ దశలోనే బానిసలుగా..

ఎక్కువగా ఇంటర్ చదివే విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసల వుతున్నారని పరిశీలకులు చెబుతున్నారు. స్నేహితులు, క్లాస్ మేట్స్ ద్వారా ఈ వ్యసనానికి అలవాటు పడుతున్నారు. వ్యాపారులు కూడా ఇలాంటి విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రూ.200 నుంచి రూ.300కు ప్యాకెట్లు అమ్ముతున్నారు. అలా కొన్న గంజాయిని పొడిచేసి సిగిరెట్లలో కలిపి పీలుస్తున్నారు. కొన్నాళ్లకు గంజాయి మత్తు సరిపోక ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ, బ్రౌన్ షుగర్, హెరాయిన్ వంటి వాటి కోసం ఇతర రాష్ట్రాల వైపు అడుగులు వేస్తూ జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు.

● నేరాలకు అదే కారణం

ఇటీవల కాలంలో జిల్లాలో చోటు చేసుకున్న హత్యలు, గొడవలు, హత్యాయత్నాల్లో ఎక్కువ గంజాయి మత్తులోనే జరిగాయని పోలీసుల విచారణలో తేలింది. గతంలో చిన్నబజారు పోలీసులు డ్రగ్ ర్యాకెట్‌ను ఛేదించి, ముఠాను అదుపులోకి

- మిగతా 6లో..

గంజాయి కేసుల వివరాలు ఇలా...

సంవత్సరం	కేసులు	పట్టుకున్నది	రూ.ధర	అరెస్టులు	వాహనాల సీజ్
2021	16	270.7 కేజీలు	2.70 లక్షలు	39	7
2022	7	708.4 కేజీలు	7.8 లక్షలు	15	7
2023	16	369.5 కేజీలు	3.69 లక్షలు	93	10
2024	13	111.9 కేజీలు	1.11 లక్షలు	44	3

- జిల్లాకు నార్కోటిక్స్ కంట్రోల్ విభాగం
- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయం
- యువతకు శాంపిల్స్ ఇచ్చి, బానిసలు చేసి..
- గంజాయి మత్తులోనే పెరుగుతున్న నేరాలు
- నూతన విభాగంతో నియంత్రణపై ఆశలు

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం

గంజాయి, మాదకద్రవ్యాల కట్టడి కోసం ప్రత్యేకంగా జిల్లాలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. ఆ టీం నిరంతరం తనిఖీలు చేస్తూ గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, అమ్మకాలు, సేవించడంపై దాడులు చేస్తోంది. విద్యాసంస్థల్లో మత్తు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాము. చెక్‌పోస్టుల్లో అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాము.

- జీ కృష్ణకాంత్, ఎస్పీ

పెన్నాకు హైఅలెర్ట్!

● భారీ వరదలు సంభవించే ప్రమాదం ● అప్రమత్తంగా ఉండాలని కేంద్రం హెచ్చరిక

నెల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెన్నా నదికి భారీగా వరద పోటెత్తే ప్రమాదముందని కేంద్ర జలశక్తి శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో పెన్నా పరివాహకంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలియజేసింది. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకూ అతి భారీ వర్షాల మూలంగా వరదలు సంభవించవచ్చని జిల్లాను అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది.



శుక్రవారం రాత్రి కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు లేఖ రూపంలో అత్యవసర మెసేజ్‌ను కేంద్ర జలశక్తి శాఖ అధికారులు పంపారు. జిల్లాలోని పెన్నా పరివాహక ప్రాంతంతోపాటు పెన్నా ఉపనదులైన కుందు, చెయ్యేరు, పాపాగ్ని, సగిలేరు పరివాహకాల్లో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు ఆ మెసేజ్‌లో స్పష్టం చేశారు. దీని మూలంగా భారీ వరద పెన్నా నదికి వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ప్రస్తుతం సోమశిల జలాశయం 89 శాతం నిండిన నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తతో వ్యవహరించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని సమన్వయంతో అంచనా వేసుకుంటూ సోమశిలకు ఇబ్బందులు లేకుండా దిగువకు నీటిని విడుదల చేయాలని సూచించారు. అదే సమయంలో పెన్నా పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని కేంద్ర జలశక్తి శాఖ సూచించింది. ఈ సూచనలను పరిగణలోకి తీసుకొని రానున్న మూడు రోజులు అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించింది.

● మళ్లీ మొదలైన వాన

నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయు గుండం ప్రభావంతో జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా మేఘాలు కమ్ముకుని చల్లని గాలులు వీచాయి. తీవ్రవాయుగుండం చైన్నైకి ఆగ్నేయం గా 340 కి.మీ దూరంలో ఉందని, ఇది తుఫాన్‌గా మారి శనివారం మధ్యాహ్నం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి దగ్గర కారైకాల్- మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంటుంది. ఆదివారం కూడా భారీ వర్షం పడే అవకాశం ఉందని ఆ కేంద్రం ప్రతినిధులు తెలిపారు.

శ్రీనివాసుడికి పుష్పయాగం

నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో బృందావనం శ్రీనివాస దీక్షితులు, వైఖానస ఆగమ పండితులతో ముందుగా మరకత గణపతి స్వామికి అభిషేకం, వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు జరిగాయి. భక్తులు వివిధ రకాల పూలబుట్టలతో ఊరేగింపుగా తరలివచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం వేద మంత్రాల నడుమ పుష్పయాగం నిర్వహించి పంచ, అష్ట, నవ నక్షత్ర కుంభ హారతులు సమర్పించారు. ఉభయకర్తలుగా కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతులు, గడ్డం శ్రీధర్‌రెడ్డి, సుజన దంపతులు వ్యవహరించారు. అనంతరం అమ్మవారి పాదాల చెంత ఉంచిన చీరలను లక్కీడిప్ ద్వారా 22 మంది మహిళలకు పంపిణీ చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)



వేదగిరీశుడికి తిరుప్పావడ సేవ

నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి(నరసింహకొండ) క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్ర పూజలు నిర్వహించారు. విశేష పూజలు, అభిషేకాల అనంతరం తిరుప్పావడ సేవ వైభవంగా జరిగింది. ప్రత్యేకించి శుక్రవారం కావడంతో అటు ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

- నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి)

చిన్నరథంపై శివయ్య ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వర ఆలయంలో జరుగుతున్న కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి చిన్నరథంలో స్వామి, అమ్మవార్ల ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామివారికి పుష్పాభిషేకం భక్తులకు కనువిందు చేసింది. ఉభయకర్తలుగా నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, స్రవంతి, కోవూరు వెంకురెడ్డి, ధనమ్మ వ్యవహరించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు.




సాగునీటి శిస్తు
చెల్లింపులు ఇక ఆన్‌లైన్‌లోనే

- పుస్తకాలు, రాతలకు స్వస్తి
- నమోదులో రేయింబవళ్ళు వీఆర్‌వోలు
- నేటితో ముగియనున్న కసరత్తు
- ఐదేళ్ళుగా ఆగిన శిస్తు వసూళ్ళ ప్రక్రియ

మనుబోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాగునీటి శిస్తు వసూళ్లలో పాత విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికి, ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ ప్రక్రియపై రెవెన్యూ సిబ్బంది ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. గతంలో శిస్తు వివరాలు ఏ రైతు ఎంత చెల్లించాడన్నది రైతుకు, వీఆర్‌వోకు తప్ప మరెవరికి తెలిసేది కాదు. అది కూడా వీఆర్‌వో నోటిలెక్కతో కట్టించేవారు. ఒక్కోసారి శిస్తు పుస్తకాలు కనబడక ఇటు అధికారులు, అటు రైతులు ఇబ్బందులు పడేవారు. వైసీపీ హయాంలోనే ఆన్‌లైన్ విధానం అమలు చేసినా పూర్తిస్థాయిలో కాలేదు. ఇంతలోనే రీసర్వే తీసుకురావడంతో ఆ ప్రక్రియను నిలిపేశారు. దీంతో రెవెన్యూ అధికారులు కూడా సాగునీటి శిస్తును రైతుల నుంచి వసూలు చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆదేశాలతో వారం రోజులుగా అడంగల్ పట్టుకుని భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వీఆర్‌వోలు రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు.

సాధారణంగా ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరూ పంచాయతీకి ఏడాదికి ఒకసారి ఇంటిపన్ను చెల్లించాలి. అప్పుడే ఆ ఇంటిపై యజమానికి హక్కు ఏర్పడుతుంది. అలానే సాగునీటిని వాడుకుంటున్న భూమి కలిగిన ప్రతి రైతు రెవెన్యూ శాఖకు శిస్తు చెల్లించాల్సి ఉంటుంది. ఈ శిస్తు ఆధారంగానే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, రాయితీలు వర్తిస్తాయి.



భూముల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న వీఆర్వోలు

మాగాణి భూములకైతే ఎకరాకు ఒక పంటకైతే రూ.200, రెండు, మూడు పంటలు వేస్తే రూ.350 చెల్లించాలి. అలాగే ఆక్వాసాగు రైతులైతే ఎకరాకు రూ.500, మెట్టభూములకైతే ఎకరాకు రూ.100 చెల్లించాలి. 1430 ఫసలీ నుంచి శిస్తు వసూళ్ళు నిలిచిపోయాయి. ప్రస్తుతం రెవెన్యూలో 1434 ఫసలీ నడుస్తోంది. అంటే ఐదేళ్ల ఫసలీలకు నీటిశిస్తు రావాల్సి ఉంది. దీని ప్రకారం వీఆర్వోలు లెక్కలు కట్టి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.

● ఎక్కడి నుంచైనా చెల్లింపులు

పొలం కలిగిన రైతు దూర ప్రాంతంలో ఉంటే సదరు వీఆర్‌వో వద్దకు వచ్చి శిస్తు చెల్లించాల్సి ఉండేది. ఆన్‌లైన్ విధానంలో ఆ ఇబ్బందులు తొలగనున్నాయి. రాష్ట్రంలో ఎక్కడున్నా, ఏ గ్రామంలో భూమి ఉన్నా దానికి కలిగిన ఖాతా నెంబర్‌ను చెప్పగలిగితే శిస్తుబకాయిల వివరాలు ఆన్‌లైన్‌లో తెలిసిపోతాయి. దీంతో రైతులు సులభంగా శిస్తు చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం తీసుకురానున్నది. అలాగే బకాయి వివరాలు కూడా తెలుస్తాయి.

రైతులకు ప్రయోజనం



కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఆన్‌లైన్‌లో నీటి శిస్తు వివరాలను వేగంగా చేయిస్తున్నాం. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరం. ఇప్పటివరకు ఎంతమేర బకాయిలు, వచ్చేఏడాది ఎంత చెల్లించాలి ఆ వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి. పైగా ఎక్కడినుంచైనా తెలుసుకోవచ్చు. రైతులు సాగునీటి శిస్తులు చెల్లించి రెవెన్యూశాఖకు సహకరించాలి.

- సిహెచ్. సుబ్బయ్య, తహసీల్దార్

ఈగల్‌తో ఆగేనా!?

(5వ పేజీ తరువాయి)

తీసుకుని విద్యార్థులకు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. అయినా డ్రగ్స్, గంజాయి రవాణాదారులు, విక్రయదారులు, వారి వెనుక ఉన్న పెద్ద వ్యాపారులను పోలీసులు పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన ఈగల్ టీం ఏ మేరకు గంజాయి, మాదకద్రవ్యాలను అరికడుతుందో చూడాలి. కాగా, జిల్లాలో ఏర్పాటు చేసే ఈగల్ స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు పోలీసు శాఖలోని వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై సిబ్బందిని తీసుకుని శిక్షణ ఇస్తారని సమాచారం. వారికి అదనంగా 30 శాతం అలవెన్స్ ఇవ్వనున్నారు.

హరహరా.. శంకరా!

● ఇరుముడులతో వైభవంగా శివభక్తుల శోభాయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శంభో శంకర .. హరహర మహదేవ... ఓంనమశ్శివాయ అనే శివనామ స్మరణతో నెల్లూరు నగర ప్రధాన రహదారి మారుమోగింది. కార్తీక మాసం సందర్భంగా శివ దీక్ష ధరించిన భక్తులు దీక్ష విరమణకు శుక్రవారం ఇరుముడి కట్టుకుని శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం పాలకమండలి మాజీ ఛైర్మన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు అర్ధ మండల దీక్ష స్వీకరించారు. ఆ దీక్ష విరమణ సందర్భంగా శుక్రవారం ఉదయం తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో రుద్రహోమం నిర్వహించారు. అనంతరం ఇరుముడి ధరించి మంగళవాయిద్యాలు, హరనామ స్మరణతో మూలస్థానేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మూలస్థానేశ్వర ఆలయ ఈవో జే శ్రీనివాసరావు, విజయకుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. వర్షంలోనూ భక్తులు పట్టలు కప్పుకుని ఇరుముడితో యాత్ర కొనసాగించారు.









రీసర్వే సమస్యలు పది రోజుల్లో పరిష్కరించాలి

● అధికారులను ఆదేశించిన జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రీసర్వే సమస్యలపై గ్రామ సభల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి పది రోజుల్లోగా సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో గ్రామసభల అర్జీలపై అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీసర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణం తేడా రావడం వంటి సమస్యలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమీక్షలో కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు ఖాతా.. రూ.200లకు వాత!

● వేలం వెర్రిగా జనాలు పరుగులు

పోస్టాఫీసులో ఖాతా తెరచి ఆధార్ లింక్ చేసుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు అందుతాయనే పుకార్లు జనాల్లో షికారు చేస్తున్నాయి. ఇంకేముంది... మగ, ఆడ అన్న తేడా లేకుండా అందరూ పోస్టాఫీసులకు పరుగులు తీస్తున్నారు. బుచ్చిలోని గిరిజాహాల్ సెంటర్‌లో ఉన్న పోస్టాఫీస్ ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతా ఉన్నవారు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి. లేదా 18 ఏళ్లు నిండిన వారికి ఎక్కడా ఖాతా లేకుంటే పోస్టాఫీసులో ఖాతా తెరవాలి. ఇది నిబంధన. అయితే, ఇవేమీ పట్టించుకోని అమాయక జనం పోస్టాఫీసులో ఖాతా తెరిస్తేనే పథకాల ఫలాలు అందుతాయన్న అపోహతో పరుగులు తీస్తున్నారు. వారిలో చైతన్యం తీసుకురావాల్సిన తపాలా ఉద్యోగులు కూడా రూ.200 వసూలు చేసి ఖాతాలు ప్రారంభించేస్తున్నారు. బుచ్చిలోని పోస్టాఫీసుకు పొరుగు మండలాల నుంచి జనం తరలివస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాతాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.



రూ.200 తీసుకుని ఆధార్ లింక్ చేస్తున్నబీపీఎం

- బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి కావలిలో అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు

కావలిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు ఆదివారం నుంచి పట్టణంలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు సూచనలతో ఈ పోటీలు జరుగుతాయన్నారు. బాల, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతాయని 13జిల్లాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. వివిధ జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేయుచున్న క్రీడాకారులకు డీబీఎస్‌లో వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, ఏవో రమేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం మహాకాళేశ్వరుని భస్మాభిషేకం

రాపూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాపూరు పట్టణంలోని పురాతనమైన శ్రీ పార్వతీ సమేత రామనాథేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసం చివరి శుక్రవారం కావడం వలన భక్తులు పోటెత్తారు. స్వామి వారిని ఉజ్జయిని మహాకాళేశ్వరునిగా అలంకరించారు. భస్మాభిషేకం, రుద్రహారతులు తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. శివనామ స్మరణలతో ఆలయం మార్మోగింది.



బడుల్లో పండుగ

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా

- వచ్చే నెల 7న మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం
- విద్యాపరమైన అంశాలపై చర్చ
- పాఠశాల అభివృద్ధిలోనూ భాగస్వామ్యం
- ఆటల పోటీలు, సహపంక్తి భోజనాలు
- జిల్లాకు రూ.48 లక్షల మంజూరు

నెల్లూరు (విద్య), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో వస్తున్న అనేక సంస్కరణలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలపరచడానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి 2047 నాటికల్లా వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. దీనిలో భాగంగానే జిల్లాలోని 2,601 ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబరు 7వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ సమావేశాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసంగా రూ.48,67,800 నిధులను కూడా విడుదల చేశారు. పదిమంది పిల్లలున్న బడులకు రూ.వెయ్యి, 300 నుంచి 400 మంది పిల్లలు ఉన్న బడులకు రూ.5 వేలు, ఇలా సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులను కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష అధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. వారం రోజులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని డీఈఓ ఆదేశాలు ఇవ్వడంతో జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు కొత్త కానప్పటికీ ఈసారి మాత్రం పలు ప్రత్యేకతలు జోడించారు. ఎన్నడూ లేని విధం గా పిల్లల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధుల కేటాయింపులు చేశారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు ఎవరిస్థాయిలో వారు మరికొంత నిధులు సేకరించి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్ ఏర్పాట్లు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ ఇలా 13 కమిటీలను ఏర్పాటు చేశారు.



● పిల్లల ప్రగతిపై నివేదికలు

పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను ఈ సమావేశంలోనే తల్లిదండ్రులకు అందచేయనున్నారు. ప్రోగ్రెస్ కార్డుల్లో మార్కులు, హాజరుతోపాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లో కనబరిచిన ప్రతిభ, ఆరోగ్యపరంగా ఎత్తు, బరువు, వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలు పొందుపరుస్తున్నారు. విద్యార్థులు ఇళ్లవద్ద సెల్‌ఫోన్స్, ట్యాబ్‌లు అధికంగా వినియోగించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతోపాటు తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందచేస్తారు. పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించి కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే సమావేశానికి సంబంధించి మినిట్ టు మినిట్ షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు వివిధ కార్యక్రమాల అనంతరం సహపంక్తి భోజనం చేస్తారు.

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణ : డీఈవో బాలజీరావు



జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను డిసెంబరు 7న జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించడంతోపాటు పాఠశాలల అభివృద్ధి, చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతో చర్చిస్తాం. అలాగే పాఠశాలల బలోపేతానికి సాయం చేసిన వ్యక్తులను సన్మానించడం, పాఠశాలల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ మెగా ఈవెంట్ ప్రత్యేక ఉద్దేశం. జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో కార్యక్రమం విజయవంతం చేస్తాము.

విస్తృత ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

జిల్లాలో నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం ఉత్సవ వాతావరణంలో జరగాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ, ఇతర అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు పాఠశాలల వైపు అడుగులు వేసేందుకు 7వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా ఈఓపీఆర్‌డీలు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసంగా ప్రత్యేక నిధులు సైతం కేటాయించినట్లు తెలిపారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల తల్లిదండ్రులను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆహ్వానించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీలను వెంటనే ఏర్పాటు చేసి ఆయా వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల సిబ్బందితో కార్యక్రమం జరిగే రోజున చర్చించే విధంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంట్రోల్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ ఉదయభాస్కర్, డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, జడ్పీ సీఈఓ మోహన్‌రావు, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, ఐటీడీఏ పీఓ పరిమళ, బీసీ వెల్ఫేర్ ఇన్చార్జి అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్



రోడ్డు మీది లారీ గుంతలోకి...

కావలి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తుమ్మలపెంట రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజాము న లారీ అదుపుతప్పి కల్వర్టు అంచున ఢీకొని ప్రక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్ తుక్కు తుక్కు అయ్యింది. ప్రకాశం జిల్లా శింగరాయకొండకు చెందిన ఓనర్ కం డ్రైవర్ థామస్, క్లీనర్‌లకు ఎలాంటి గాయాలు కాకుండా ప్రాణాలతో బయటపడటం ఆశ్చర్యకరం. రెండురోజుల క్రితం వీరు చత్తీస్‌ఘడ్ నుండి చిత్తూరుకు ఐరన్‌లోడుతో బయలు దేరాడు. మార్గమధ్యలో ఈ జరిగింది.

రేషన్ డీలర్లు తూకాల్లో అవకతవకలకు పాల్పడ కుండా ప్రతి ఏడాది రేషన్ దుకాణాల్లో ఉండే కాటాల న్నింటికీ తహసీల్దార్ కార్యా లయంలో సీల్ (టాకా) వేస్తారు. అందులో భాగం గా శుక్రవారం డీలర్లు కాటా లను తహసీల్దార్ కార్యాల యానికి తీసుకురావడంతో లైసెన్సు సిబ్బంది సీలు వేశారు. తూకం యంత్రం లో ఏదైనా సమస్య తలెత్తినా తమకు తెలప కుండా సీల్ తీయ రాదని డీలర్లను అధికారులు హెచ్చరించారు.

- మనుబోలు (ఆంధ్రజ్యోతి)



రేషన్ కాటా... పడింది టాకా!

స్వర్ణ గరుడుడిపై లక్ష్మీనృసింహుడి వైభోగం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచ లకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి శుక్రవారం స్వర్ణ గరుడుడిపై ఊరేగారు. శ్రీవారి జన్మనక్షత్రం (స్వాతి) సందర్భంగా స్వామివారు చందనాలంకర ణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉద యం అభిషేకం అనంతరం శాంతి హోమం, శ్రీవారి కల్యాణం కనులపండు వగా జరిగింది. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం శ్రీవారికి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై ఉత్సవమూర్తిని కొలువు దీర్చి వివిధ రకా ల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)



సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ చంద్రబాబు అండ

- టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న మంత్రి రామనారాయణ



మంత్రి ఆనంకు శాశ్వత సభ్యత్వ పత్రాన్ని అందజేస్తున్న తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా మొదలైన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శుక్రవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నాయకులతో సభ్యత్వ నమోదుపై సమా వేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ టీడీపీ కుటుంబ పెద్దగా నారా చంద్రబాబునాయుడు అండగా ఉంటారని, వారితోపాటు కు టుంబసభ్యలకు కూడా భరోసా లభిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆత్మకూరు నియోజకవర్గం ఐదో స్థానంలో, నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో మొదటి స్థానంలో ఉందన్నారు. గ్రామస్థాయిలో కార్యకర్తలందరూ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని, అన్ని వార్డు పరిధిల్లోని ప్రతి బూత్‌లో టీడీపీకి పోలైన ఓట్లలో కనీసం 60 శాతానికి పైగా సభ్యత్వం చేయించాలని సూచించారు. ముందుగా ఆయన రూ. 1,00,000 చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని పొందిన గుర్తింపు పత్రాన్ని ఆత్మకూరు పట్టణ టీడీపీ కన్వీనర్ తుమ్మల చంద్రారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అదేక్రమంలో ఆయన కుమార్తె లీల కైవల్యారెడ్డి, కుమారుడు ఆనం శుభకర్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డికి పార్టీ శాశ్వత సభ్యత్వం చేయిం చారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గంలోని 16 మందికి రూ. 28.90లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పరిశీలకులు బు లైట్ రమణ, సుఖవాసి శ్రీనివాస్, కార్తీక్, ఆత్మకూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- కలువాయి : మండల కేంద్రమైన కలువాయి బస్టాండులో ఏర్పాటు చేసిన శిబిరంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు ప్రారంభించారు. సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా శివారెడ్డి, తేజ తదితరులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేటలో డిసెంబరు 7, 8తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సీపీఎం జిల్లా మహాసభల విజయవంతం చేయాలని పార్టీ నాయకు లు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల కార్మికులకు పార్టీ నాయకుడు జీవీబీ కుమార్ పిలుపు నిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా మహాసభల సన్నా హక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, విద్యుత్ సర్‌ఛార్జీలు పేదలకు భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు మాదాల రమణయ్య, దువ్వూరి జాన్, ఎస్‌ఏ గౌస్, ఇందిరావతి, దార్ల మాధవరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పెయ్యదూడల ప్రదర్శన

వరికుంటపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కని యం పాడులో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పెయ్య దూడల ప్రదర్శన, అందాల పోటీలు ఆకట్టుకున్నాయి. అనంతరం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఏ జిల్లా విస్తరణాధి కారి శ్రీనివాసరావు దూడల పోషణ, చూడి పశువుల యాజమాన్య పద్ధతులపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో దుత్తలూరు పశుసంవర్ధకశాఖ సహా య సంచాలకుడు చంద్ర శేఖర్‌రెడ్డి, పశువైద్యాధి కారి రాఘవేంద్రశర్మ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, పశుసంవర్ధక, వ్యవసాయశాఖ సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న పాడిరైతులు

ఆదురుపల్లిలో ఆగని చోరీలు

- పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తి

చేజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లిలో గత రెండు నెలల కాలంలో దాదాపు ఐదుకు పైగా దొంగతనాలు జరగడంతో వ్యాపారులు ఆందోళన చెందు తున్నారు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి కూడా ఆదురుపల్లి ప్రధాన కూడలిలో ఉన్న షేక్ కాలేషాకు చెందిన కూల్‌డ్రింక్ షాపు షట్టర్ పగులగొట్టి లోపల ఉన్న సుమారు 15వేల రూపాయల విలువచేసే వస్తువులను దొంగలు అపహరించారు. పోలీసులు ఈ దొంగతనాల ను ఛాలెంజ్‌గా తీసుకున్నారు. చేజర్ల ఎస్‌ఐ తిరుమలరావు పరిసర ప్రాంతాల్లో గాలించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. చోరీలకు పాల్పడిన వారిపై కఠి న చర్యలు తీసుకోవాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

మనుబోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పామాయిల్ పరిశ్రమ వెనుకభాగంలో ఉన్న చెట్లలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో ఎస్‌ఐ శివరాకేష్ తన సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించి స్థావరంలో ఉన్న ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారివద్దనున్న రూ. 6900 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పేకాట, కోడిపందెంలు నిర్వహిస్తే కఠిన శిక్షలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	111
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7378
వెండి కిలో ధర	రూ. 91,900
వెండి ఒక గ్రాము	రూ.94.90

ఇద్దరిపై కేసు నమోదు

అల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పరస్ప ర దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి నట్టు ఎస్‌ఐ కిషోర్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఇందుపూరుకు చెందిన రఫీ, సంతోష్‌లు తమ పొలాల వద్ద ఏర్ప డిన వాగ్వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో ఇరువురు పరస్పర దాడికి దిగారు. ఈ విషయంపై ఇరువురు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకు న్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ఉపాధికి ఉన్నతి



- జాబ్‌కార్డు కలిగిన వారి పిల్లలకు నైపుణ్య శిక్షణ
- ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు
- వంద పనిదినాలు పూర్తి చేసుకున్న వారికి అవకాశం

ఉదయగిరి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల నుంచి వలసలు అరికట్టేందుకు ఉద్దేశించినది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. బియ్యం కార్డు కలిగిన పేద కుటుంబాలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జాబ్‌కార్డు మంజూరు చేస్తారు. కుటుంబ సభ్యులు ఎందరున్నా ఏటా ఏప్రిల్ 1 నుంచి మార్చి నెలాఖరులోపు వంద రోజుల పనిదినాలు కల్పి స్తుంటారు. ఇద్దరు కుటుంబ సభ్యులుంటే ఒక్కొక్కరికి 50 రోజుల పాటు పని ఉంటుంది. కొన్నిచోట్ల పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తయిన యువత కూడా ఈ పనులు చేస్తున్నారు. పని దినాలు పూర్తయిన తరువాత ఉపాధి కోసం పలువురు ఇత ర ప్రాంతాలకు వెళుతున్నారు. అటువంటి వారి కోసం స్వయం ఉపాధికి బాటలు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేసిం ది. ఇందుకుగాను ఆసక్తి కలిగిన విభాగాల్లో ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఉన్నతి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

24,128 కుటుంబాలు

జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 317 పంచాయతీల్లో 24,128 కుటుంబాలు వంద రోజులు పని పూర్తి చేసుకొని ఉన్నాయి. అందులో ఉన్నతి శిక్షణకు ఆసక్తి ఉన్నవారి వివరాల కోసం ఉపాధి సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతున్నారు. సుమారు 2,500 మందికి ఈ ఏడాది శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఎంపికైన వారిలో మహిళలకు నెల్లూరులో, పురుషులకు కందుకూరులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ.. ప్రోత్సాహకం

వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లో 10వ తరగతి, ఐటీఐ చదివి 18-45 సంవత్సరాలు వయసు కలిగి న యువతీ, యువకులకు ఆసరాగా నిలవనుంది. కంప్యూటర్, ఎలక్ట్రికల్, రిటైల్, హోటల్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్, సోలార్ పలకలు, వ్యవసాయ పరికరాల ఏర్పాటు తదితర విభాగాల్లో వారికి ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆయా రంగాల్లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఆ సమ యంలో రోజుకు రూ.300 చొప్పున పారితోషికం కూడా చెల్లిస్తారు. శిక్షణ పొందే యువతకు అవసరమైన మెటీరియల్‌తోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. శిక్షణలో ఉత్తీర్ణులైన అభ్యర్థు లకు సర్టిఫికెట్లు ఇస్తారు. ఆయా రంగాలకు సంబంధించిన ప్రైవేటు సంస్థల్లోనూ ఉద్యో గ అవకాశాలు కల్పిస్తారు. ఉదయగిరి మండలంలో వంద రోజులు పనిదినా లు పూర్తి చేసుకున్న కుటుంబాలు 927 ఉండగా ఇప్పటికే 550 కుటుంబాలు సర్వే చేసినట్లు ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు.

సోమశిలలో 69.524 టీఎంసీల నీరు

అనంతసాగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయా నికి ఎగువ నుంచి శుక్రవారం 3,156 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.524 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 6,000, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

న్యూడ్ వీడియో కాల్‌పై నిఘా పెట్టండి

- ఎస్పీని కోరిన జనసేన నేతలు

నెల్లూరు(క్రైం), నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): న్యూడ్ వీడియో కాల్స్ ద్వారా జరిగే స్కామ్ రోజు రోజుకు పెరిగిపోవడం తో యువత జీవితాలు నాశనం చేసుకుంటూ ఆత్మ హత్యలకు పాల్పడే స్థాయికి చేరుకున్నారని, దీనిపై నిఘా ఉంచి అరికట్టాలని జనసేన పార్టీ నాయకులు శుక్రవారం జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను కోరారు. నగ రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీను కలిసిన జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ కొన్ని హానికరమైన యాప్‌లు ప్లే స్టోర్ నుంచి నిషేధించినా నిర్వాహకులు మోసపూ రిత లింక్‌లను పంపుతూ యువత అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ట్రాప్ చేస్తున్నారన్నారు. పోలీసు శాఖ మోసపూరిత లింకుల గురించి ప్రజలకు అవగా హన కల్పించేలా ఆయా యాప్‌ల పేర్లు, వివరాలు బహిర్గతం చేస్తే ప్రజలకు ప్రయోజకరంగా ఉంటుంద న్నారు. స్పందించిన ఎస్పీ మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేస్తే వారికి అండగా నిలుస్తామని, బాధితు ల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, అను మానాస్పద వీడియో కాల్‌లు లిఫ్ట్ చేయకూడదని, తెలియని లింక్‌లు క్లిక్ చేయకూడదని ప్రజలకు సూచించారు. అనంతరం ఎస్పీని సన్మానించారు.



ఎస్పీని సత్కరిస్తున్న కిషోర్

ఎంఎస్‌ఎంఈల సర్వేకు సహకరించండి

- పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి చేపట్టిన ఎంఎస్‌ఎంఈల (సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమ) సర్వేకు పరిశ్రమల యజ మానులు పూర్తిగా సహకరించాలని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. పరిశ్రమల బలోపేతానికి అవసరమైన చర్యలు, బ్యాంకు రుణాల మం జూరు తదితర అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొ న్నారు. పరిశ్రమల పూర్తి వివరాలను ఒకే పోర్టల్‌లో నమోదు చేసి తద్వారా ఎంఎస్ ఎంఈల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి ప్రభుత్వం దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌పై ఎంపీడీవోకు ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న దేవకుమార్

ఏఎస్ పేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చౌటభీమవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌పై వెటర్నరీ అసిస్టెంట్ దేవకుమార్ శుక్రవారం ఎంపీడీవో ప్రసన్న కుమారికి ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారిద్దరూ ఉద్దేశ పూర్వకంగా తనకు ఈనెల జీతం రాకుండా చేయాలని ప్రభుత్వానికి బిల్లు పంపలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎందుకు జీతం బిల్లు పంపలేదని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ కించపరిచేలా మాట్లాడుతున్నారని, తనకు న్యాయం చేయాలని ఎంపీడీవోను కోరాడు. విచారించి తగిన చర్యలు తీసుకుంటమని ఆమె తెలిపారు.

గ్రామ కంఠం భూమి ఆక్రమణ

- ఇస్కపాళెంలో 12 ఎకరాలు కబ్జా
- దర్జాగా పంటల సాగు
- తహసీల్దారుకు గ్రామస్థుల ఫిర్యాదు
- పరిశీలించిన అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఇస్కపాళెం రెవెన్యూ పరిధిలోని పోలి నాయుడు చెరువు సమీపంలోని కోట్లు విలువ చేసే 12ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు 20మంది స్థానిక మైనార్టీ ప్రజలు తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశా రు. గ్రామానికే చెందిన ఓ ముస్లిం వ్యక్తి ఆక్రమించి సాగు చేసుకునేందుకు సన్నా హాలు చేస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొ న్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గ్రా మ వీఆర్వో, సర్వేయర్, సిబ్బందితో కలిసి పొలాలను పరిశీలించారు. 12.40 ఎకరాలు గ్రామకంఠం భూమి ఆక్రమణలో వుండగా అందులో 58సెంట్లు శ్మశానానికి కేటాయించి ఉన్నట్లు గ్రామ రెవెన్యూ, సర్వే అధికారులు రెవెన్యూ రికార్డుల పరిశీలనలో గుర్తించారు. గతంలో ఆక్రమిత పొలంలో నాట్లు కోసం దుక్కులు చేస్తున్న కబ్జాదారులు, శ్మశానం ఆక్రమిస్తే ఒప్పుకునేదిలేదని ఇరువర్గాల మధ్య వివాదం రేగింది. ఈ సందర్భంగా అధికారుల వెంట వచ్చిన ముస్లింలు మాట్లాడా రు. తామంతా శ్మశానం కోసం బాగుచేసుకున్న భూమిని ఆక్రమిస్తే ఒప్పుకోమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆ స్థలం అభివృద్ధికి నిధులు కేటా యిస్తామని ఎన్నికల్లో మాటిచ్చారని ముస్లింలు ఈ సందర్భంగా అధికారులకు తెలిపారు. దీనిపై తహసీల్దారు మాట్లాడారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే విచారించి చర్యలు చేపడతామన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న ట్లు పలువురు స్థానిక ముస్లింలు తెలిపారు.



ఆక్రమణకు గురైన గ్రామకంఠం భూమి

దత్తత పొందటం సులభం : కలెక్టర్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్, హేనా సుజన్, సురేష్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం పిల్లలను దత్తత పొందటం సులభమని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మాతృత్వం ఒక వరం - దత్తత దానికి మరో మార్గం శీర్షికతో రూపొందించిన బ్రోచర్లను శుక్రవారం ఆయన చాంబర్‌లో ఆవి ష్కరించారు. దత్తత ఎలా పొందాలి అనే అంశాలు, అందుకు కావలసిన ధ్రువపత్రాల గురించి బ్రోచర్‌లో వివరించారన్నారు. మరింత సమాచారం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లోగానీ, ఐసీడీఎస్ అధికారులనుగానీ, జిల్లా బాలల పరి రక్షణ అధికారులనుగానీ సంప్రదించాలని సూచించారు. దత్తత ప్రక్రియను www.cara.nic.in వెబ్‌సైట్ ద్వారా చేసుకోవచ్చ న్నారు. చట్ట విరుద్ధంగా దత్తత తీసుకున్న వారికి 3 నుంచి ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, లక్ష రూపా యల జరిమానా విధించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పొగనారు ధరల్లో హెచ్చుతగ్గులు

- సాగు, పెట్టుబడులపై ప్రభావం

వాణిజ్య పంటగా పేరుగాంచిన పొగాకు పంట ను సాగు చేసిన రైతన్నకు రెండేళ్లుగా మద్దతు ధర లభిస్తోంది. గతేడాది ఒక బ్యారన్ కలిగిన రైతుకు 7.5 ఎకరాల విస్తీర్ణంలో పొగాకు సాగుకు, 35 క్వింటాళ్ల పొగాకు అమ్మకాలకు అనుమతి బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది (2024-25) ఒక్కో బ్యారన్ కలిగిన రైతుకు 9.3 ఎకరాల విస్తీర్ణంలో సాగుకు, 42.75 క్వింటాళ్ల అమ్మకాలకు అనుమతి ఇవ్వడంతో రైతులు ఎక్కువ విస్తీ ర్ణంలో పొగాకు సాగుచేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పొగానారుకు గతంలో కన్నా డిమాండ్ పెరిగిం ది. కలిగిరి వేలం కేంద్రం పరిధిలో సుమారు 150-200 ఎకరాల్లో పొగనారు సాగుచేస్తున్నారు. నారు సాగుకు సుమారు 40 నుంచి 120 రోజుల వరకు వివిధ దశల్లో నారును పీకి మూటలు కట్టి రైతులకు విక్రయిస్తున్నా రు. పొగాకు బోర్డు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసి పొగనారు చేసే రైతులకు సూచనలు, సలహా లు ఇవ్వడంతో స్థానికంగా పొగనారుకు డిమాండ్ ఏర్పడింది. వర్షాలు కురసినపుడు, రైతులు బుర ద ఏత వేసే క్రమంలో మూట నారు (6వేల మొక్కలు) ధర రూ.4వేల నుంచి 5వేలు పలుకుతోంది. వర్షాలు లేని సమయంలో రూ.2వేలు పలుకుతోంది. అయితే వర్షాలు లేనప్పుడు ట్యాంకర్లతో నీరు తోలడం, కూలీలతో మోయించడం ద్వారా అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది కావున ఎక్కు వ మంది వర్షాలు కురిసినపుడు సాగు చేస్తారు. పొగనారు నుండే పెట్టుబడులు పెరుగుతుండటంతో ఈ ప్రభావం సాగుమీదపడుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో గతేడాదికన్నా ఈసారి 20శాతం మేర అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మడుల వద్ద పొగనారు మూటలు

- కలిగిరి (ఆంధ్రజ్యోతి)

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం: డీఎస్పీ



ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

ఉదయగిరి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గంజాయి విక్రయించినా, సేవించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎన్ వెంకట్రావు, ఎస్‌ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, రఘునాథ్, శివకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం : మండల పరిధిలోని సీతారామపురం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం కావలి డీఎస్పీ శ్రీధర్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని పలు సమస్యలను స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ ద్వారా తెలుసుకొని వాటిపై దృష్టి సారించాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉదయగిరి సిఐ వెంకటరమణ, సీతారామపురం ఎస్సై శివకృష్ణా రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనకట్ట సుందరీకరణ పనుల పరిశీలన



రివిట్‌మెంట్ పనులు పరిశీలిస్తున్న ఈఈ వెంకటేశ్వర్లు

ఉదయగిరి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రూ. 9 కోట్లతో జరుగుతున్న ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ పనులను శుక్రవారం ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా అయన ఆనకట్టకు జరుగుతున్న రివిట్‌మెంట్, కాంక్రీట్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సుందరీకరణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడంతోపాటు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారుకు సూచించారు. పట్టణం నుంచి వచ్చే మురుగు నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆనకట్ట సుందరీకరణ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ కందుకూరి చంద్రమౌళి, గుత్తేదారు అక్కి భాస్కర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తే జరిమానా

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తే రూ.100 జరిమానా విధించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె. అనూష శుక్రవారం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణాన్ని పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యం అన్నారు.

● అల్లూరు : స్థానిక నగర పంచాయతీలో బహిరంగ మలమూత్ర విసర్జనను నిషేధిస్తూ తీర్మానం చేసినట్టు నగర పంచాయతీ కమిషనరు ఉమామహేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పొదుపు మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నట్లు పేర్కొన్నారు. బహిరంగంగా మలమూత్ర విసర్జన చేసిన వారికి రూ.30 మూత్రవిసర్జన చేసిన వారికి రూ.20 జరిమానా విధిస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు. మల, మూత్ర విసర్జనరహిత నగర పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.



రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్

కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రంకు రోడ్డు తర్వాత అత్యధికంగా రద్దీ ఉండే రోడ్డు క్రిష్టియన్‌పేట మెయిన్ రోడ్డు. ప్రయివేట్ ఆసుపత్రులన్నీ ఆ రోడ్డుకు అనుసంధానంగా ఉంటాయి. అలాగే మూడు ప్రయివేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి రద్దీగా ఉండే రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లే వాహనాలు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఆటంకం ఏర్పడి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ముదివర్తి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

అల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దళిత సర్పంచ్‌ను అవమానించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విడవలూరు మండలం ముదివర్తి దళిత సర్పంచ్ నిర్మలమ్మను పంచాయతీ కార్యదర్శి దుర్భాషలాడడం దారుణం అన్నారు. సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేస్తామని బెదిరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వెంటనే సదరు కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మీటర్ రీడర్స్‌ను ఆదుకోవాలని వినతి

కందుకూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో బిల్లుల జారీ చేస్తున్న తమను ఆదుకోవాలని మీటర్ రీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తీసుకొస్తున్నదని ఈ మీటర్లకు సిమ్ సిస్టమ్ రావటంతో ఇకముందు రీడింగ్ తీసే పని ఉండబోదని, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 300మంది ఉపాధి కోల్పోతారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో తమకు విద్యుత్‌శాఖలోనే ప్రత్యామ్నాయ పనులకు ఉపయోగించుకోవాలని కోరారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి



కార్యకర్తలకు సూచనలిస్తున్న సూపర్‌వైజర్ షాను

ఉదయగిరి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సూపర్‌వైజర్ షేక్‌షాను సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో దుత్తలూరు, నర్రవాడ, ఉదయగిరి-2 సెక్టార్ల కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు, దాని అనర్థాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వహిస్తూ నెలసరి నివేదికలు సకాలంలో అందజేయాలని సూచించారు.

పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను బహిష్కరించండి

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ముసుగులో అగ్రకుల బ్రాహ్మణీయ మనువాదులు కందుకూరులో నిర్వహించ తలపెట్టిన పీడీఎస్‌యూ అర్థశతాబ్ధి ఉత్సవాలను దళితులంతా బహిష్కరించాలని మాజీ పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పీడీఎస్‌యూ మాజీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. దళిత విప్లవ నాయకుడైన నాదెండ్ల బ్రహ్మయ్యను హత్యచేసిన హంతకులు దళిత చైతన్యాన్ని నీరుగారుస్తున్నారని ఆరోపించారు. పీడీఎస్‌యూ మాజీ నాయకులు, బీటీపీ నాయకులు కళ్లగుంట మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రిటైర్డ్ వార్డెన్ వెంకటేశ్వర్లు, దళిత నేత పాలేటి కోటేశ్వరరావు, సాధు మాల్యాద్రి, జీఆర్ అంబేద్కర్, పెదబ్రహ్మయ్య జాన్‌బాబు, మున్నంగి రమేష్, షేక్ అబ్దుల్లా, మాలకొండయ్య, శ్రీనివాసరావు, కావలి సుబ్బారావు, పల్నాటి చెన్నయ్య, కొండలరావు పాల్గొన్నారు.

నిధులు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిదే

బిట్రగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి నిధులు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికే దక్కుతుందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు. శుక్రవారం బోగోలు పార్టీ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సుధీర్‌బాబు, వేంకటేశ్వర రెడ్డి, సుధాకర్, రఘురాం నాయుడు, వెంకటేశ్వర్లు, మాధవరావు, వెంకయ్య, విజయ్‌కుమార్, ప్రభాకర్, సుబ్బారావు, అహ్మద్‌బాషా ఉన్నారు.

అడ్రస్ లేని 'ఆత్మగౌరవం'

నిర్మాణాలకు నోచుకోని మరుగుదొడ్లు

నీరుగారుతున్న ప్రభుత్వాల ఆశయం



మండల పరిషత్ కార్యాలయంలో అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్లు



స్త్రీశక్తి భవనంలో నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



హౌసింగ్ కార్యాలయంలో నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

వరికుంటపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న స్వచ్ఛ కార్యక్రమాల ఆశయాలు పరోక్షంగా నీరుగారిపోతున్నాయి. మండల కేంద్రమైన వరికుంటపాడుకు ఉద్యోగం, వ్యాపారం తదితర పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. పలు గ్రామాల మీదుగా 565, 167-బి జాతీయ రహదారుల నిర్మాణం జరగడంతో ఈ పరిస్థితి నెలకొంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు సైతం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్నప్పటికీ ఉద్యోగులు, ప్రజలకు మాత్రం 'ఆత్మ గౌరవం' అందని ద్రాక్షగానే ఉంది.బస్టాండ్ సెంటర్, ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో కనీస వసతులు లేవు. ఉద్యోగులు, ప్రజలు అత్యవసర సమయంలో గోడ చాటుకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. దుకాణదారులు, ఇతర గ్రామాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కనీసం చిన్నపాటి మరుగుదొడ్లనైనా బస్టాండ్ సెంటర్‌లో నిర్మించాలని వేడుకుంటున్నారు.

అసంపూర్తిగా నిర్మాణాలు

బస్టాండ్ సెంటర్‌తో సహా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గతంలో మరుగుదొడ్ల నిర్మాణాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టి చేతులు దులుపుకున్నారు. అసంపూర్తిగా నిలిచిన పనులతో అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అలాగే స్త్రీశక్తి భవనం, హౌసింగ్ కార్యాలయాల ప్రాంగణాల్లో నిర్మించిన మరుగుదొడ్లు సైతం నీటి వసతి కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి బస్టాండ్ సెంటర్‌తో సహా ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మరుగుదొడ్లు నిర్మించి ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మౌలిక వసతుల కరువు

- టీచర్స్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు లేవు
- ఇళ్ల మధ్యలో నిలుస్తున్న మురుగునీరు



రొచ్చురోడ్డు కిరువైపులా చిల్లచెట్లు, నీటిగుంటలు

కావలి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) స్థానిక టీచర్స్ కాలనీలో మౌలిక వసతులు కొరవడి సమస్యలకు నిలయంగా మారింది. సీసీ రోడ్లు, డ్రైన్లు లేకపోవడంతో వర్షాలు పడినపుడు కాలనీకి వెళ్లే రోడ్డంతా బురదయంగా మారుతుంది. పాదచారులు ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లలోని వాడిన నీరంతా నివాసాల మధ్య ఉన్న ఖాళీ ప్రాంతాల్లో నిలిచి నీటి గుంటలను తలపిస్తున్నాయి. ఇందులో పిచ్చిమొక్కలు, చిల్లచెట్లు పెరిగి అడివిని తలపిస్తోంది. దీంతో విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని స్థాకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా పారిశుద్యం కొరడటంతో దోమలకు నిలయంగా మారింది. రాత్రిళ్ల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

● అర్ధాంతరంగా నిలిచిన సీసీ రోడ్ల నిర్మాణం

గత పాలకులు ఎన్నికల ముందు పనులు ప్రారంభించి సైడ్ గట్లు నిర్మించి రోడ్ల నిర్మాణం చేపట్టక అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. రోడ్ల నిర్మాణం పేరుతో తవ్విన మట్టి రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఈ సమస్యలకు మోక్షం ఎప్పుడోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

● ఇబ్బందులు అనుభవిస్తున్నాం: శారద స్థానికురాలు

కొన్నేళ్ళగా ఈ కాలనీలోనే నివాసం ఉంటున్నాం. పాలకులు, అధికారులు మౌలిక వసతుల కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. వర్షాలు పడినపుడు ఇంటి నుంచి బయటకు వెళ్లలేక పోతున్నాం. చిల్లచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

గ్రామాల అభివృద్ధికి కృషి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

లింగసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. ఉపాధిహామీ నిధులతో లింగసముద్రంలో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో 34 సిమెంటు రోడ్ల పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసులు మాజీ జడ్పీటీసీ ప్రభావతి, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, గుర్నాథం, సీహెచ్.బ్రహ్మయ్య, శ్రీనివాసులు, మాజీ సర్పంచు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సీహెచ్ బాలకోటయ్య, మక్కెన మల్లికార్జున పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

చేజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లిలోని గురుకుల పాఠశాలలో శుక్రవారం మహిళా సాధికారత, బాలల అభివృద్ధిపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడీఎస్ సిడిపివో సునీలత, ప్రిన్సిపాల్ శైలజకుమారి, సఖి వన్ స్టాప్ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

సంగం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలోని ఎంఆర్సీ భవనంలో ఎంఈవో జానికిరామ్ వచ్చే నెల 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్ సమావేశం గురించి ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో గూగుల్ మీట్‌లో విద్యాశాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ, సెక్రటరీ చరవాణి సందేశాన్ని వినిపించారు. అనంతరం వారు పేర్కొన్న అంశాలపై సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 57 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో -2 మల్లయ్య, పాల్గొన్నారు.

11 మద్యం సీసాల స్వాధీనం

కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నంగిదిన్నెలో శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అనుపల్లి వెంకమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఎక్సైజ్‌శాఖకు అందిన సమాచారం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ ఎం.దేవిక, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఈగల్ జీవో విడుదలపై హర్షం

వింజమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ఈగల్ గ్రూపును ఏర్పాటు చేయడం పట్ల స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నల్లగొండ్ల సృజన హర్షం వ్యక్తం చేశారు. యువత పెడదారి పడుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలువురికి వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత కుటుంబాల సభ్యులకు అందజేశారు. ఇందులో వలేటివారిపాలెం మండలం చెర్లోపాలెం బూసి రంగయ, కళవళ్ల పిట్టా ప్రవీణ్, గుడ్లూరు గడ్డె కౌశిక్ ఉన్నారు. అలాగే లింగసముద్రం మండలం ఆర్‌ఆర్ పాలెం కిలారి వినయ్, గుడ్లూరు మండలం కొత్తపేట జాజుల సుప్రజ అలాగే కందుకూరు మండలం విక్కిరాలపేట కల్యాణి, వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెం అనుమోలు మాధవరావు, గుడ్లూరు మండలం దప్పళంపాడు రావిపాటి సాయిసుమంత్‌లు ఉన్నారు. వీరికి ముందస్తుగా ఆపరేషన్ల కోసం ఎల్‌ఓసీలు మంజూరనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, పొడపాటి మహేష్ పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలి

అధికధరల సమస్య రాకుండా అన్ని రైతుసేవా కేంద్రాలలో ఎరువుల నిల్వలు పెట్టాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. నియోజవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు. ఎక్కడా ఎంఆర్పీకి మించి ఎరువులు విక్రయించరాదని కేవలం డీలర్లపైనే ఆధారపడకుండా అన్ని రైతు సేవాకేంద్రాలలో ఎరువుల నిల్వలు పెట్టాలని కోరారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చినా వ్యవసాయాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏడీఏ అనసూయ ఏఓలు రాము, హేమంత్ భరత్‌కుమార్, తిరుమలజ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా ఆవాజ్ కమిటీ ఆవిర్భావ దినోత్సవం



ఉదయగిరి రూరల్: విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

ఆత్మకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టెక్కి ఉర్దూ స్కూల్‌లో శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ మండల కార్యదర్శి పి యస్దానీబాష, జెవీవీ కళాకారుడు గద్దర్‌బాబు, అవాజ్ మండల కమిటీ సభ్యులు పి మస్తాన్, పి సల్మాన్‌ఖాన్, షేక్ ఖాజా రంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్: మండలంలోని బిజ్జంపల్లి బీసీ కాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పెన్నులు, మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు షేక్ నాయబ్‌రసూల్, రజాక్‌అన్వర్ మౌజాన్, ఇమామ్‌లకు ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇమామ్, మౌజన్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంటనే సర్వేలు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటి జియోట్యాగ్ సర్వేను త్వరతిగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్ సూచించారు. అదే క్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలుకు సంబంధించిన అసెస్మెంట్ ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలన్నారు. మండలంలోని మహిమలూరులో జరుగుతున్న ఇంటి పన్ను నిర్ధారణ ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పలు పథకాలకు సంబంధించిన నగదు జమ చేయడానికి ఎన్‌పీసీఐ ద్వారా బ్యాంకు లింకింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా గృహ నిర్మాణాలు చేపట్టదలిచిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయడంతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లు అవసరమైన వారిని గుర్తించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జియోట్యాగ్ ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం ఆయన మహిమలూరు, నువ్వూరుపాడు సచివాలయాలను సందర్శించి బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

22 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉదయగిరి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలలో 54 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ఉదయగిరిలో ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆకుల నరసింహులు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, ప్లేస్‌మెంట్ అధికారి జనార్ధన్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు అక్మల్, విశ్వరూపాచారి తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వం

● వివేక్, కావలి పురపాక సంఘం ప్రణాళికాధికారి



కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వటం లేదని కావలి పురపాలక సంఘం ప్రణాళిక అధికారి వివేక్ తెలిపారు. నిబంధనల మేరకు నిర్మాణాలకు అనుమతి ఇస్తామన్నారు.

? అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారా.

! పట్టణంలో ఇప్పటివరకు ఎక్కడా అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వటం లేదు.

? నిభంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.

! తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిబంధనల మేరకు అనుమతులు ఇస్తున్నాం

? 30 అడుగుల రోడ్డు ఉంటేనే భవన నిర్మాణాలకు అనుమతి అన్న నిబంధనలను ఎంత వరకు పాటిస్తున్నారు.

! 30 అడుగుల రోడ్డు లేని ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న రోడ్డు ఎంతుందో తెలుసుకుని 30 అడుగులకు సరిపడా రోడ్డు ఉండేలా చూస్తాం. అపుడు కూడా రోడ్డుకు స్థలం వదిలితేనే అనుమతులు ఇస్తున్నాం.

న్యూస్ బాక్స్

అమరలింగేశ్వరుడికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉలవపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మన్నేటికోట వెలసిన గంగాపార్వతి సమేత అమలింగేశ్వరుడికి శుక్రవారం భక్తులు లక్ష కుంకుమార్చన, మృత్యుంజయ హోమం, సామూహిక పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి కళ్యాణంతో పాటు మన్నేరులో గంగా హారతి, అన్నసంతర్పణ చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాజుపాలెం జాతీయ రహదారి సమీపంలోని సాయిబాబా మందిరంలో అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న వితరణ చేపట్టారు.

ఘనంగా కోటి దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీతారామపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి శుక్రవారం సందర్భంగా మండల పరిధిలోని ఘటిక సిద్ధేశ్వర క్షేత్రంలో ఆలయ అర్చకులు సిద్దయ్య, కాశయ్యల ఆధ్వర్యంలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. ఇష్టకామేశ్వరిదేవి, ఘటిక సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర ప్రసాదాలు స్వీకరించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

కలువాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఎం నారాయణ తెలిపారు. ఒక్కో దానికి రూ.36 వేలు వంతున 22 కేంద్రాలకు రూ.7.92లక్షలు మంజూరైనట్లు చెప్పారు. వీటిలో 14 కేంద్రాలకు మోటారు, ట్యాంక్ ఏర్పాటుకు ఒక్కో దానికి రూ.17వేలు వంతున రూ.2.38లక్షలు అదనంగా మంజూరైనట్లు ఆయన వివరించారు. త్వరలో ఈ నిధులతో నిర్మాణాలు ప్రారంభిస్తామని ఆయన తెలియజేశారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

దగదర్తి (బిట్రగుంట), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వైద్యులు అఖిల తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు అలేఖ్య, సూపర్‌వైజర్ విజయ, సిబ్బంది రవీంద్ర, గుల్జార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పేర్ల సత్యనారాయణ పర్యటన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సుందరయ్యనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక వాసవీ క్లబ్, వనితాక్లబ్ సభ్యులు యూనిఫాంలు అందజేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఓ నిరుపేద మహిళలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం 62 సార్లు రక్తదానం చేసిన కనమలపూడి రమేష్‌ను, ఇటీవల గౌరవ డాక్టరేట్లు పొందిన చక్కా వెంకటకేశవరావు, రవ్వా శ్రీనివాసులులను సత్కరించారు.

జగన్ విధానాలతో అప్పుల ఊబిలో ఆర్టీసీ

● జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



మాట్లాడుతున్న జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఆర్టీసీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని డీఆర్ ఉత్తమ హోటల్‌లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసిన పాలనంతా తూతూ మంత్రంగా సాగిందని, అప్పట్లో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు ఎంతో ఆనందపడ్డారని, అయితే ఇప్పుడు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో ఆర్టీసీ కార్మికుల కుటుంబసభ్యులకు మెరుగైన వైద్యం అందించేందుకు సంస్థ ఎంతైనా ఖర్చు చేసేదని, ఇప్పుడు వైద్యసేవల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ సంస్థకు ఉన్న అనేక స్థలాలను కుదవకు పెట్టారని, ఆ స్థలాలపై జగన్మోహన్‌రెడ్డి కన్ను వేసి వాటి కోసమే ప్రభుత్వంలో విలీనం చేశారని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, ఆర్టీసీను ఆదాయ మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నాయకులు మిడతల రమేష్, చిలకా ప్రవీణ్, ముక్కు రాధాకృష్ణ గౌడ్, గిరికుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 'సేద్యం'



● కేఎన్‌ఎం వరి విత్తనానికి ప్రాధాన్యం ● దుక్కులు, చెంగోరుకు పెరిగిన కూలి రేట్లు

● పల్లెల్లో సందడి చేస్తున్న బెంగాల్ కూలీలు

నెల్లూరురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో నెల్లూరుకు తూర్పు, పడమర ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగునీరు పుష్కలంగా ఉండటం, వర్షాలు అనుకూలంగా మారడంతో రైతులు సేద్యపు పనుల్లో బిజీగా ఉన్నారు. దుక్కులు, చెంగోరుకు కూలి రేట్లు పెరిగాయి. వరి నాట్లు జోరందుకున్నాయి. బెంగాల్ కూలీలు పల్లెల్లో సందడి చేస్తున్నారు. తొలి ప్రాధాన్యంగా కేఎన్‌ఎం-1638 (సన్నాలు) వరి విత్తన రకాన్ని, రెండు, మూడు ప్రాధాన్యంలో ఆర్ఎన్ఆర్-15048 (షుగర్‌లెస్), బీపీటీ-5204 రకాలను సాగు చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు ఎకరం దుక్కికి రూ.1400 ఉండగా రూ.1600లకు పెంచిన ట్రాక్టర్ల యజమానులు రైతులపై ఆర్థిక భారాన్ని మోపారు. మరో గత్యంతరంలేని రైతులు పెరిగిన ఆర్థిక భారాన్ని మోస్తున్నారు. ఇది కౌలు రైతులకు మరింత భారంగా మారింది. రూ.500 ఉన్న చెంగోరు కూలీని రూ.650కి పెంచారు. బెంగాల్ నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలు ఎకరా వరి నాట్లుకు రూ.4500-5000 వరకు వసూళ్లు చేస్తున్నారు. ప్రధాన వ్యవసాయ సీజనైన రబీలో మండలంలో సుమారు 25 వేల ఎకరాలలో వరి సాగు చేస్తారు. కనుపూరుకాలువ, సర్వేపల్లి, కోడూరు, లేబూరు కాలువల కింద ఆయకట్టు, లోతటులో పూర్తి విస్తీర్ణంలో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. తమిళనాట పురుడుపోసుకున్న కేఎన్‌ఎం-1638 రకం విత్తనంపై ఈ సారి రబీలో రైతులు మొగ్గు చూపారు. రెండు, మూడు ప్రాధాన్య క్రమంలో ఆర్ఎన్ఆర్, బీపీటీ రకాలను, ఆ తరువాత స్థానంలో కేఎన్‌ఎం-733 రకాన్ని సాగు చేస్తున్నారు. ఇప్పటికే నారుమళ్లు 25 రోజుల వ్యవధి దాటడంతో నారేతలు జరుగుతున్నాయి. ఇక ఎరువుల ధరలు కూడా స్వల్పంగా పెరుగుతుండటంతో రైతులకు వ్యవసాయ పెట్టుబడుల్లో అదనంగా మారింది.

న్యూస్ బాక్స్

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

పొదలకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా నుంచి ఎంపికైన పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాల భౌతిక రసా యన శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్‌ను శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, నాయకులు బోగోలు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మండల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వేదాయపాలెంలోని వేద అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామికి కేరళ సంప్రదాయ కార్తీక మాస మండల పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం, సాయంత్రం వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా మండవ వెంకటశ్రీనివాస్ నాయుడు, ధనలక్ష్మి దంపతులు, మల్లికార్జున రావు, సుహాసిని దంపతులు వ్యవహరించారు. ఆలయ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహనరావు, గడ్డం విజయకుమార్, పావలా ప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

రైతు సమస్యల పరిష్కారం

కోవూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పెన్నానది పరివాహక ప్రాంతంలో జమ్మిపాళెం రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఆ శాఖ అధికారులు శుక్రవారం పరిష్కరించారు. పొలాలకు సాగునీరు అందించేందుకు వీలుగా గతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్త బ్రేకర్, ఫీడర్లను ఏర్పాటు చేశారు. తమ సమస్యకు పరిష్కారం చూపిన విద్యుత్ శాఖ ప్రొడక్షన్ డిప్యూటీ ఇంజనీరు పవన్ కుమార్, ఆపరేషన్స్ డీఈ మధుసూదనరెడ్డి, ఏఈలు రమేష్‌బాబు, సుబ్రహ్మణ్యంలను రైతులు అభినందించారు.

శివనామ స్మరణతో మారుమోగిన శివాలయం

రాపూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పురాతనమైన పార్వతీ సమేత రామనాధేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని ఉజ్జయిని మహాకాళేశ్వర్ అవతారంలో అలంకరించారు. భస్మాభిషేకం, రుద్రహారతులు వైభవంగా జరిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కార్తీక వనభోజనాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో శుక్రవారం కార్తీక దామోదర పూజలు, కార్తీక వనభోజనాలు జరిగాయి. మహిళా మండలి సభ్యులు మాస శివరాత్రి రుద్రాభిషేకాలు, అర్చనలు, సామూహిక లలితా సహస్ర నామ పారాయణాలు, లలితా సహస్ర అర్చనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ధాన్య కేంద్రం మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీ నరసింహం, ఆనందకుమార్, పవని అనిల్ కుమార్, మల్లవరపు లక్ష్మీనరసింహారావు, ప్రభాకర్‌రావు, తంగిరాల శ్రీకాంత్ శర్మ, ఐ.జయలక్ష్మి, నాగరత్నకుమారి, సురభి ఉమాదేవి, ఎం.బాలత్రిపుర సుందరి, తదితరులు పాల్గొన్నారు.

లేగుంటపాడులో పొలం పిలుస్తోంది!

కోవూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): లేగుంటపాడులో శుక్రవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఇందిరావతి మాట్లాడారు. పంటల సాగులో పురుగు, తెగుళ్ల నివారణకు వేపనూనె కషాయాన్ని వాడుకోవాల్సిందిగా సూచించారు. ద్రవ జీవామృతాన్ని తయారు చేసే పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి కోటేశ్వరి, వీఏఏ వంశీ పాల్గొన్నారు. తమకు పాకలు ఏర్పాటు చేసేందుకు ఆర్థికసహాయం అందించాల్సిందిగా అరటి రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు

ముత్తుకూరు, నవం బరు 28(ఆంధ్ర జ్యోతి): వారం రోజులుగా భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు చేసిన సంఘటన కృష్ణపట్నం గోపాలపురంలో శుక్ర వారం చోటుచేసుకుం ది. కృష్ణపట్నం పోర్టు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపురానికి చెందిన కత్తి చంద్రయ్య గత శనివారం నుంచి కనిపించడం లేదని అతని భార్య ప్రసన్న శుక్రవారం ఫిర్యాదు చేసింది. అన్నిచోట్లా వెతికినా ఆచూకీ తెలియలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జె శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

వైసీపీ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



సాగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతు లకు తీవ్ర అన్యాయం జరిగిందని, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైసీపీ నేతలు అడ్డంగా దోపిడీకి పాల్ప డి రైతుల నోళ్ల కొట్టారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. మండలంలో ని చెముడుగుంట వద్ద పూడికతీసిన సాగునీటి కాలువను శుక్రవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కాలువలకు ఐదేళ్ల తర్వాత మళ్లీ పూర్వవైభవం వచ్చిందని సోమిరెడ్డి ఎదు ట రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో రైతులే దగ్గ రుండి వారి పర్యవేక్షణలో పూడికతీత పనులు చేసుకుంటుంటే గోవర్ధన్‌రెడ్డి రోజూ సామాజిక మధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు.

నక్కలకాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు

నక్కలకాలనీ సమగ్ర అభివృద్ధికి అన్ని విధా లుగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నక్కలకాలనీలో పర్యటించారు. సమస్య లపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో బీ.సురేంద్ర, కే.నాగేంద్రప్రసాద్, డీ.అశోక్, మదుసూదన్‌రెడ్డి, రమేష్‌నాయుడు, ధనుంజయ నాయుడు తదితరులు ఉన్నారు.

తిరుమలలో అన్నమయ్య భవన్ పునఃనిర్మించాలి

● 11న తిరుపతిలో శోభాయాత్ర ● అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర కార్యదర్శి



శోభాయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అన్నమయ్య భవన్‌ను తిరిగి పునర్మించాలని కోరుతూ డిసెంబర్ 11వ తేదీన తిరుపతిలో శోభాయాత్ర నిర్వహిస్తున్నామని అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య తెలిపారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో అక్రమంగా కూల్చి వేసిన అన్నమయ్య గృహాన్ని పునఃనిర్మించాలని దక్షణాది రాష్ట్రాల్లో 11.50 లక్షల సంతకాలను సేకరించామన్నారు. ఈ సంతకాలతో కూడిన పత్రాలను తిరుపతిలోని కార్యనిర్వాహణ అధికారికి అందజేస్తామని తెలిపారు. ఇందుకోసం నిర్వహిస్తున్న శోభాయాత్రలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తిరుమలలో 3600 కళాబృందాలు హరినామ సంకీర్తన చేస్తుండగా మరో 7వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వీరందరికీ సంకీర్తన నిర్వహించే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, రాష్ట్ర నేతలు రాజారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణారెడ్డి, వెంకయ్య, అమనుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దాడిని అడ్డుకున్నందుకు నరికేశారు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని డైకస్‌రోడ్డు ఆటో మెకానిక్‌పై స్థానిక రౌడీషీటర్ అతని అనుచరులు దాడి చేస్తుంటే.. అడ్డుకున్నందుకు నా భర్తను విచక్షణా రహితంగా నరికి వేశారని కల్లూరు హౌసింగ్ బోర్డు కాలనీ చెందిన క్షతగాత్రుడి భార్య షేక్. జాస్మిన్ తెలిపారు. శుక్రవారం ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ బుధవారం రాత్రి తన భర్తపై దాడి జరుగుతుండగా నైట్‌బీటు తిరుగుతున్న ఎస్‌ఐ దుండగులను వారించడంతో పారిపోయారన్నారు. రక్తగాయాలతో ఉన్న తన భర్త షేక్. మీరాను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి తనకు ఫోను చేశారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు గాయాలకు కుట్లు వేసి ఇంటికి వెళ్లమని బయటకు నెట్టేశారని తెలిపారు. వైద్యం లేకుండా తాము ఇంటికి ఎలా వెళ్లాలని ప్రశ్నించడంతో వైద్యులు కోపగించుకున్నారని తెలిపారు. రాత్రి అంతా చలిలోనే ఆసుపత్రి బయటే ఉన్నామన్నారు. ఉదయం ఎస్‌ఐ దాడి వివరాలు తీసుకుని తిరిగి ఆసుపత్రిలో చేర్పించారని తెలిపారు. తాను తన భర్తతో ఆసుపత్రిలో ఉండగా దాడి చేసిన రౌడీలు కల్లూరు హౌసింగ్ బోర్డు కాలనీలోని తమ గృహంపై దాడి చేశారని, పిల్లలను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ఫోనులో అందర్ని చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పచ్చదనం ఉంటేనే ప్రజలకు ఆహ్లాదం : కమిషనర్



డివైడర్లను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో పచ్చదనం విరివిగా పెంచితేనే ప్రజలకు ఆహ్లాదం దగ్గరవుతుందని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ అన్నారు. శుక్రవారం రంగనాయకులపేట ప్రాంతంలోని పినాకిని పార్కును పరిశీలించారు. పార్కుకు అనుసంధానంగా పది అడుగుల అప్రోచ్ రోడ్డును 30 అడుగులకు విస్తరించి ఇరువైపు మొక్కలతో గ్రీనరీ పెంచాలన్నారు. వాటికి రక్షణగా గార్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం చాలుచింతల ప్రాంతంలో కరకట్ట ప్రదేశంలో వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించి ఇక్కడ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసేందుకు అనుకూలతను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మినీబైపాస్‌లో ఉన్న ఎన్టీఆర్ పార్కును పరిశీలించారు. ఈ ప్రాంతంతో పాటు అన్నీ ప్రాంతాలలో డివైడర్లను ఏర్పాటు చేసి అందులో పచ్చదనం ఉండేలా మొక్కలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప మండల పూజ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేదాయపాలెంలోని వేద అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్య ప్ప స్వామికి కేరళ సంప్రదాయ కార్తీక మా స మండల పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం, సాయంత్రం వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా మండవ వెంకటశ్రీనివాస్ నాయుడు, ధనలక్ష్మి దంపతులు, మల్లికార్జు నరావు, సుహాసిని దంపతులు వ్యవహరించారు. ఆలయ అధ్యక్షుడు గూడల శేషగిరి రావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహనరావు, గడ్డం విజయకుమార్, పావలా ప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడమే లక్ష్యం

● ఐటీఐ జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి



విజేతలైన విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు(విద్య), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడమే లక్ష్యంగా ఐటీఐ కళాశాలలు పనిచేస్తున్నాయని జిల్లా కన్వీనర్ కె.శ్రీధర్‌రెడ్డి అన్నారు. వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలలో శుక్రవారం ప్రాజెక్ట్‌ల నైపుణ్యంపై జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు వారు నేర్చుకున్న అంశాలపై పట్టు సాధించడంతో పాటు ప్రాజెక్ట్‌లను సరైన పద్ధతిలో సిద్ధం చేసి ప్రజంట్ చేయడం కూడా వారి ప్రతిభకు అద్దం పడుతుందన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో వాకాడు ప్రభుత్వ ఐటీఐ ప్రథమ, వెంకటేశ్వరపురం బాలికల ప్రభుత్వ ఐటీఐ ద్వితీయ, బాలుర ప్రభుత్వ ఐటీఐ తృతీయస్థానాలను దక్కించుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇఫ్కో కిసాన్‌సెట్ ప్రతినిధులు సి.అనిల్‌బాబు, కె.ఏడుకొండలు, సీహెచ్.జగదీష్, టాటా ట్రైవ్ కోఆర్డినేటర్ ఎం.మార్కండేయులు, బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరుకు చేరిన యువతి పాదయాత్ర



భారతికి స్వాగతం పలుగుతున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నుంచి తిరపతికి పాదయాత్ర చేపట్టిన యువతికి జనసేన పార్టీ నాయకులు శుక్రవారం చింతారెడ్డిపాలెం జాతీయ రహదారి వద్ద ఘన స్వాగతం పలికి జిల్లా పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నేత నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ విజయనగరం ప్రాంతానికి చెందిన భారతి కుటుంబం 15 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కోయంబత్తూర్‌కు వెళ్లారన్నారు. కరోనా సమయంలో భారతి తల్లిదండ్రులు మృతి చెందారని, ఆమె ప్రస్తుతం స్పిన్నింగ్ మిల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుందన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో గత ఎన్నికల్లో ఆయన గెలిస్తే కోయంబత్తూర్ నుంచి మంగళగిరికి పాదయాత్రగా నడుచుకుంటూ వెళ్లి అక్కడ పవన్‌ను కలిసి తిరిగి తిరుమలకు నడుచుకుంటూ వస్తానని మొక్కుకున్నారన్నారు. ఆ మేరకు పాదయాత్రగా మంగళగిరికి వెళ్లిన ఆమె తిరిగి అక్కడి నుంచి తిరుమల వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకొని తిరిగి మంగళగిరికి పాదయాత్రగా వెళ్లాలని నిర్ణయించుకుందన్నారు. అందుకు కావాల్సిన ఆర్థిక సాయం చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్, వైకృష్ణారెడ్డి, వేటూరి రవికుమార్, గునుకుల కిషోర్, గుడి హరిరెడ్డి, గుర్రం కిషోర్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై క్యాండిల్ లైట్



కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

నెల్లూరు(వైద్యం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 1వ తేదీన హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా శుక్రవారం రాత్రి నగరంలోని ఎస్ఎన్‌పీసీ సంస్థ కార్యాలయం వద్ద హెచ్ఐవీ క్యాండిల్ లైట్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఉద్యోగులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొని క్యాండిల్ వెలిగించి హెచ్ఐవీ బాధితులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెచ్ఐవీ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ముస్లింల అన్నప్రసాద వితరణ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 48వ డివిజన్ కోటమిట్ట వినాయక స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం అయ్యప్ప భక్తులకు ముస్లింలు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ముస్లిం నేతలు సిద్ధిక్ అలీ, రియాజ్, సంధానీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 500 మంది అయ్యప్పలు భిక్ష స్వీకరించారు. ఈ కార్యక్రమం లో అస్లామ్, ప్రభాకర్, నయీమ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

● పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరుంధతీయ సేవా సం ఘం ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు శ్రీనివాసులు, ప్రసాద్, పెంచలయ్య, ఎం పెంచలయ్య, అయ్యప్ప, సేవా సమాజం గౌరవ అధ్యక్షుడు శివాడి పరంధామిరెడ్డి పాల్గొన్నారు.



పొదలకూరు : అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న అరుంధతీయ సేవా సంఘం సభ్యులు

నమ్మకం పెంచేందుకే మెగా పేరంట్స్ డే : ఎంపీడీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

బుచ్చిరెడ్డిపాలెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలపై పిల్లలు, తల్లిదండ్రులు నమ్మకం పెంచుకునేందుకు డిసెంబర్ 7వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. తలిదండ్రులకు తప్పనిసరిగా ఆహ్వానపత్రికను అందజేసి, ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంతో పిల్లల ప్రగతిపై నిర్వహించే చర్చ పాఠశాలల అభివృద్ధికి ఒక వేదికగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పీవీ.రత్నం, ఏఓ మెప్మా ఏఓ సుధాకర్‌రావు, రిసోర్స్ సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



కల్యాణ వేదికపై కొలువుదీరిన శివపార్వతులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం వేడుకల్లో భాగంగా స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. ఉదయం శివపార్వతులకు, కన్యకాపరమేశ్వరికి అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. మూలవర్ల విశేష అలంకారం భక్తులను ఆకట్టుకుంది. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి పేగు షణ్ముఖరావు, గౌరవ సలహాదారుడు ఎంపీ ఆంజనేయులు, ఒమ్మిన జనార్దన్‌రావు పర్యవేక్షించారు.

యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎంపికైన యూటీఎఫ్ మండల శాఖ కమిటీ

పొదలకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ భవనంలో శుక్రవారం మండల మహాసభ నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి పి సుభాషిణి, రాష్ట్ర కౌన్సిలర్ బి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యమాలలో మహిళలతో పాటు ముందడుగు వేయాలని కోరారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా పి రామ్మూర్తి, అధ్యక్షుడిగా బీవీపీ కల్యాణ్, ప్రధాన కార్యదర్శిగా వై రమేష్‌కుమార్, సహాధ్యక్షులుగా ఏ జ్యోతి, ఎం అంకిరెడ్డి, కోశాధికారిగా వీవీ సుబ్బారావు, కుటుంబ సంక్షేమ శాఖ కన్వీనర్‌గా నాగయ్య, కోకన్వీనర్‌గా ఎం సుధాకర్‌రావులను ఎంపిక చేశారు. వీరికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారిగా పి సుభాషిణి, పరిశీలకులుగా బి వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్వో సంఘం నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వీఆర్వో సంఘం నాయకులు శుక్రవారం కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్లో, డీఆర్వో ఉదయభాస్కర్‌ను మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిసి వినతిపత్రం, పూల మొక్క అందచేశారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఖాళీ స్థలాలకు పన్ను వసూలు పనుల నుంచి వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరామన్నారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి దారా రమణయ్య, డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి తిరుమలరాజు, వీఆర్‌వోలు జగదీష్, రవి శేఖర్, రాజగోపాలు, విష్ణు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

షిరిడీలో సాయిపల్లకీ ఊరేగింపు



షిరిడీ వీధుల్లో సాయిపల్లకీ ఊరేగింపులో సాయిదర్బార్ భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): షిరిడీలో నెల్లూరు నగరానికి చెందిన సాయిదర్బార్ (అద్దాల మందిరం) ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు సాయిదీక్షా భక్తులు సాయి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక మాసం సందర్భంగా సాయి దీక్ష మాలలు ధరించి మండల దీక్షలు చేస్తారు. ఈ దీక్షలో సాయిసచ్చరిత గ్రంథాలయ ఊరేగింపు నగరంలో నిర్వహించారు. ఇరుముడులతో పవిత్ర క్షేత్రం గొలగమూడి వెంకయ్యస్వామి సన్నిధికి పాదయాత్ర చేశారు. మండల దీక్షలు పూర్తికావడంతో ఇరుముడిలతో షిరిడీకి చేరుకుని సాయిపల్లకీని ఊరేగింపు నిర్వహించి తమ ఇరుముడులను షిరిడీ సాయిబాబాకు సమర్పించి మొక్కలు చెల్లించి దీక్షలు విరమించారు. ఈ కార్యక్రమాన్ని సాయిదర్బార్ మందిరం చైర్మన్ మధుసాయి పర్యవేక్షించారు. దాదాపు 400 మందికి పైగా సాయి భక్తులు పాల్గొన్నారు.

తుఫాను ముందటి ప్రశాంతత

రెండు రోజులుగా జిల్లాలో తుఫాను ముందటి వాతావరణం కన్పిస్తోంది. కోవూరు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం నుంచి చలిగాలితో చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. తుఫాను ముందస్తు సమాచారంతో రైతులు గురు, శుక్రవా రాల్లో వరి నాట్లను నిలిపివేశారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)





అల్లకల్లోలంగా తూపిలిపాళెం సముద్రతీరం

తుపాన్‌గా మారనుంది

నేటి మధ్యాహ్నం కారైకల్ - మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం

● అప్రమత్తంగా అధికార యంత్రాంగం

తిరుపతి/సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారనుంది. ఈ ఫెంగల్ తుపాన్ శుక్రవారం మధ్యాహ్నం నుంచి గంటకు 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయుదిశగా కదులుతూ అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాన్ కదలికలను, దీని తీవ్రత ఏ ప్రాంతాల్లో అధికంగా ఉంటుందనేది ముందస్తుగా ఇస్రో ఉపగ్రహాల ద్వారా సమగ్ర సమచారం సేకరించి ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేస్తున్నారు. షార్ కేంద్రంలో రాడార్ ద్వారా కూడా తుపాన్ కదలికలను పసిగడుతున్నారు. ఇటీవల ఇస్రో ప్రయోగించిన ఈఓఎస్-08, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల ద్వారా తుపాన్ తీవ్రత, దిశ మార్పు, సముద్రంలో వీచే గాలులు, అక్కడ వాతావరణ పరిస్థితులను ఇస్రో సేకరించి ప్రభుత్వానికి చేరవేస్తున్నట్లు సీనియర్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ తుపాన్ ప్రస్తుతం చెన్నైకి ఆగ్నేయంగా 380 కిలోమీటర్ల దూరంలో, పుదుచ్చేరికి తూర్పు ఆగ్నేయంగా 340 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఇది బలపడి వాయువ్య దిశగా పయనించి శనివారం మధ్యాహ్న సమయంలో పుదుచ్చేరి దగ్గర కారైకల్-మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. దీని ప్రభావంతో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్ష సూచనలు ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టులో మూడో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

సముద్ర తీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంది. వర్షపాతం లేకున్నా ఈ మండలాల పరిధిలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. సాయంత్రం నుంచీ అలల ఉధృతి పెరిగింది. పది అడుగుల ఎత్తున అలలు ఎగసి పడుతున్నాయి. సముద్ర తీర ప్రాంత మండలాలపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదంటూ అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. దీంతో నాలుగైదు రోజులుగా మత్స్యకారులు వేటకు వెళ్ళడం లేదు. సూళ్ళూరుపేట, తడ మండలాల్లో పులికాట్ సరస్సులోనూ మత్స్యకారులు వేట నిలిపివేశారు. తడ, సూళ్ళూరుపేట, చిట్టమూరు మండలాల్లో మాత్రం శుక్రవారం రాత్రి 8 గంటల నుంచీ మోస్తరు వర్షం కురుస్తోంది.

చిరుజల్లులు.. చలి గాలులు

జిల్లాలో శుక్రవారం అప్పుడప్పుడు చిరుజల్లులు తప్ప వర్షమేమీ కురవ లేదు. చలి గాలులు మాత్రం జనాన్ని వణికించాయి. అయినా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వుంది. జిల్లాలో భారీ నుంచీ అతి భారీ వర్షాలు కురుస్తాయని, మెరుపు వరదలు కూడా సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించడంతో తీర ప్రాంతంలోని మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూములు ఏర్పాటయ్యాయి. ఇక, జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 23 డిగ్రీలుగా నమోదైంది.



మల్లిమడుగుకు చేరుతున్న నీరు

రేణిగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయరుకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరుతోంది. దీంతో నీటి మట్టం పెరిగింది. ఈ రిజర్వాయరు సామర్థ్యం 0.181 టీఎంసీ కాగా ప్రస్తుతం నీటి మట్టం 0.168కు చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకుతోడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో రాత్రికి డ్యాం నిండే అవకాశముందని డీఈ చంద్రమౌళి అభిప్రాయపడ్డారు. డ్యామ్ నిండితే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామన్నారు.



వెంకన్న సేవలో కీర్తి

సినీ కథానాయిక కీర్తి సురేష్ శుక్రవారం ఉదయం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వచ్చే నెలలో పెళ్లాడనున్న నేపథ్యంలో స్వామివారి ఆశీస్సుల కోసం వచ్చానని చెప్పారు.

ఆధార్ లింక్ కోసం..

● హెడ్‌పోస్టాఫీసుకు బారులు తీరిన జనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు లబ్ధిదారులకు నేరుగా అందాలంటే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలి. దీనికి శనివారం చివరి రోజు. దీంతో శుక్రవారం తిరుపతిలోని హెడ్ పోస్టాఫీసుకు జనం తరలివచ్చారు. ఇలా చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆడబిడ్డ నిధి రూపంలో రూ.1500 లబ్ధి పొందుతామని భావించిన ప్రజలు ఆధార్ కార్డులు తీసుకొని తపాలా కార్యాలయాలకు చేరుకొంటున్నారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో తపాలా కార్యాలయాల ఎదుట ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

- తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి





లీలాహేలగా..

వీణ చేతపట్టి.. హంస వాహనంపై పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఊరేగారు. తిరుమాడవీధుల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

- కార్తీక బ్రహ్మోత్సవ విశేషాలు 6వ పేజీలో

సీఎం.. తిరుగు ప్రయాణం

● మార్గమధ్యంలో క్రీడాకారుల కృతజ్ఞతాపూర్వక స్వాగతం



విమానాశ్రయం వద్ద సీఎంకు కలెక్టర్, ఇతర అధికారుల వీడ్కోలు

తిరుపతి/రేణిగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోదరుడి కర్మక్రియల కోసం బుధవారం నుంచీ స్వగ్రామమైన నారావారిపల్లిలో గడిపిన సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం రాజధానికి తిరుగు ప్రయాణమయ్యారు. నారావారిపల్లెలో ఉదయం పలువురు పార్టీ నేతలు కలిశారు. నాయకులతో మాట్లాడిన సీఎం వారి నుంచీ విజ్ఞాపనలు స్వీకరించారు. ఆపై 10.05 గంటలకు నివాసం నుంచీ తిరుగు ప్రయాణమయ్యారు. ఇటీవల క్రీడా రంగానికి ప్రోత్సాహాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ఆధ్వర్యంలో శ్రీనివాసమంగాపురం నుంచీ తిరుపతి రూరల్ కాలూరు వరకూ రెండు కిలోమీటర్లు వేలాది మంది క్రీడాకారులు రోడ్డుకు ఇరువైపులా నిలుచుని 'థ్యాంక్యూ సీఎం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి కృతజ్ఞతలు తెలిపారు. వీరిని గమనించిన సీఎం చంద్రబాబు కాన్వాయ్ ఆపి శాప్ ఛైర్మన్ రవి నాయుడుతో కలసి వాహనం ఫుట్‌బోర్డుపై నిలుచుని వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

విమానాశ్రయంలో సాదర వీడ్కోలు

ఉదయం 10.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎం చంద్రబాబు 11.05 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ బయల్దేరి వెళ్ళారు. విమానాశ్రయంలో ఆయనకు ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, బొజ్జల సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, గాలి భానుప్రకాష్, నెలవల విజయశ్రీ, మురళీ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, ఏపీ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర వర్మ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, డీఐజీ షిమోషి బాజ్‌పేయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సాల్, తిరుపతి కమిషనర్ మౌర్య తదితరులు వీడ్కోలు పలికారు.

జిల్లాకు ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగిన 66 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో జిల్లాకు ముగ్గురు అధికారులు రానున్నారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న సుధారాణి జీఎన్‌ఎస్‌ఎస్ (గాలేరు-నగరి-సుజలస్రవంతి) యూనిట్-1కు.. కలెక్టరేట్‌లోని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌కు రోజ్‌మాండ్.. టీటీడీలోని భూసేకరణ విభాగానికి (ఎల్ఏ)వెలిగొండ స్పెషల్ కలెక్టర్ పీఏగా పనిచేస్తున్న సువర్ణమ్మను నియమించారు. అయితే, శ్రీవారి దర్శనానికి వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండే జిల్లాకు.. కీలకమైన ప్రొటోకాల్ పోస్టులకు ఎవరినీ నియమించలేదు. ప్రొటోకాల్ పరిధిలోని రెండు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులు కొన్నాళ్లుగా ఖాళీగా ఉన్నాయి.



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

చెన్నై వెళ్ళిన మంత్రి నారా లోకేశ్

చంద్రగిరి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): గురువారం రాత్రి నారావారిపల్లెలోనే బస చేసిన మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉదయం 8 గంటలకు నివాసం నుంచీ వెలుపలికి వచ్చి ప్రజలను, నాయకులను కలుసుకున్నారు. ప్రజల నుంచీ అర్జీలు స్వీకరించారు. అనంతరం 8.30 గంటలకు బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని.. చెన్నై వెళ్ళారు. మధ్యాహ్నం 12 గంటలకు సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, రామ్మూర్తినాయుడు సతీమణి నారా ఇందిర, కుమారులు నారా గిరీష్, నారారోహిత్ నారావారిపల్లె నుంచి తిరుగు పయనమయ్యారు. నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ ఛైర్మన్ రవినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నేతలు కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, గౌస్ బాషా, బాలకృష్ణమూర్తి, గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.








బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటలకు ముత్యపు పందిరి
- మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
- సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్‌సేవ
- రాత్రి 7 గంటలకు సింహవాహనం



పెద్ద శేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

వాన జల్లుల్లో
చల్లని తల్లి వేడుకలు



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు వాన జల్లుల నడుమ వేడుకలు ఘనంగా కొనసాగాయి. సుప్రభాతసేవ అనంతరం సహస్రఅర్చన, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం వాహన మండపంలో పట్టు పీతాంబరాల వజ్రవైడూర్యాలు స్వర్ణాభరణాలతో అమ్మవారిని అలంకరించి పెద్దశేషుడిపై అధిష్ఠింపజేశారు. ఉదయం పరమపద వైకుంఠనాథుని రూపంలో పెద్దశేష వాహనంపై తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. వర్షం కారణంగా కొంతసేపు ఘటటోపం నీడన అమ్మవారి వాహనసేవ సాగింది. సాయంత్రం 6 గంటలకు వీణచేతపట్టిన సరస్వతిదేవిగా శ్వేతవర్ణ పట్టువస్త్రం, వజ్రవైడూర్య స్వర్ణాభరణాలతో ఊంజల్‌సేవలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. అనంతరం ఆస్థాన మండపం నుంచి వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి అమ్మవారి ఉత్సవమూర్తిని హంసవాహనంపై కొలువుదీర్చారు. రాత్రి గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా భక్తుల కోలాటాలు, భజన బృందాలు, మంగళవాయిద్యాలు, జీయర్ స్వాముల ప్రబంధపారాయణం నడుమ అమ్మవారు హంసవాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. భక్తులతో ఆలయ మాడవీధులు కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమాల్లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్‌బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి











శ్రీవారికి వైఖానసం.. అమ్మవారికి పాంచరాత్రం
ఎందుకిలా?

తిరుమలేశుడికి వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్య కైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తే, ఆయన దేవేరి పద్మావతి అమ్మవారికి పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా వీటిని నిర్వహిస్తారు. ఎందుకు ఇలా.. అనే సందేహానికి అమ్మవారి ఆలయ అర్చకులు, కంకణభట్టార్ కాండూరు శ్రీనివాసాచార్యులు ఇలా వివరించారు...

"నిత్య కైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు ఎలా నిర్వహించాలి.. అనే అంశాన్ని వైకుంఠంలో శ్రీమహావిష్ణువు అయిదు రాత్రుల పాటు అమ్మవారికి వివరించారట. తొలుత అమ్మవారికి ఆ తర్వాత వరుసగా ఆదిశేషుడు, గరుత్మంతుడు, బ్రహ్మ, పరమేశ్వరులకు ఐదురాత్రుల ఆగమశాస్త్రాన్ని ఉపదేశించారు. సాక్షాత్తు స్వామివారే ఐదు రాత్రులు ఉపదేశించడం వల్ల ఈ శాస్త్రానికి పాంచరాత్ర ఆగమశాస్త్రం అనే పేరువచ్చింది. ఆ తర్వాత దీనిని 40వేల మంది ఋషులు- మహాఋషులు, దాన ఋషులు, బ్రహ్మఋషులు, రాజ ఋషులు 1006 సంహితరూపంగా రచించి అందించారు. అందులో 108 సంహితాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటి ఆధారంగానే ఆయా ఆలయాల్లో ఒక్కొక్క సంహితను అనుసరించి పూజలు నిర్వహిస్తున్నారు. ఇది మనసుల్లో అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. తిరుచానూరు అమ్మవారి ఆలయంతోపాటూ భద్రాచలం, శ్రీకూర్మం, సింహాచలం, శ్రీరంగం, కంచి, కుంభకోణం, కురుక్షేత్రం, ఒంటిమిట్ట తదితర ఆలయాల్లో పాంచరాత్ర ఆగమశాస్త్రంను అనుసరించే పూజలు జరుగుతున్నాయి. వైఖానసం విషయానికి వస్తే.. తిరుమల శ్రీవారి ఆలయంతోపాటూ, నాగలాపురం, నారాయణవనం, అప్పలాయగుంట, శ్రీనివాస మంగాపురం, కార్వేటినగరం, గోవిందరాజస్వామి ఆలయం, కీలపట్ల తదితర ఆలయాల్లో స్వామివార్లకు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్యకైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు."



కాండూరు శ్రీనివాసాచార్యులు

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ఫల పుష్పాలే మాలలుగా..
తిరుమంజన సేవ

అమ్మవారి స్వర్శ క్షణకాలమే అయినా పవిత్రమైనది.. అపురూపమైనది. స్నపనతిరుమంజన కార్యక్రమంలో ఉత్సవమూర్తికి చేసే అలంకరణలు స్వల్పకాలానికే పరిమితమైనా విభిన్నంగా కొనసాగుతాయి. పూలు, ఫలాలు, ఎండు ఫలాలతో మాలలు కట్టి అలంకరిస్తారు. ఏదీ కొన్ని నిముషాలకు మించి అమ్మవారి మెడలో ఉండదు. అయినా ప్రత్యేకంగా ఫల, పుష్పాలతో అలంకరించిన శ్రీకృష్ణ ముఖ మండపంలో ఈ స్నపన తిరుమంజనసేవ జరుగుతుంది. శుక్రవారం మధ్యాహ్నం కంకణభట్టర్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన సేవలో ఏడు రకాల మాలలను అమ్మవారికి అలంకరించారు. ఇందులో నెమలి ఈకలు, తామర పూల గింజలు, పైనాపిల్, రోజ్ పెటల్స్, నందివర్ధనం మొగ్గలు, తులసిమాలలు, కిరీటాలు, గొడుగులు ఉన్నాయి. ఈ మాలలను ఓ భక్తుడు అమ్మవారికి కానుకగా అందించారు. మండపాన్ని వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్‌తో పాటు ఆపిల్, జామ, మొక్కజొన్న, ఆర్కిడ్స్, పైనాపిల్ వంటి ఫలాలతో అలంకరించారు.



ఫలపుష్పాలతో ఆకట్టుకుంటున్న కేటీ మండపం



ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



నెమలి ఈకలు, తామర గింజలు, నెల్లికాయ మాలలు

ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 21న కన్నప్ప ధ్వజారోహణం, 22న స్వామివారి ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, రాత్రి నందిసేవ, 27న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28న స్వామిఅమ్మవార్ల కల్యాణం, 1న సభాపతి కల్యాణం, 2న కైలాసగిరి ప్రదక్షిణ, 3న ధ్వజావరోహణం, 4న పల్లకీసేవ, 5న ఏకాంతసేవ, 6న శాంతి అభిషేకం జరుగుతుందన్నారు.

నేడు అష్టోత్తర శత కలశాభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, బిల్వ నిమజ్జనం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. అలాగే సాయంత్రం 7గంటలకు స్వర్ణముఖిలో నదీ హారతులు జరుగుతాయని తెలిపారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లును కూడా పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శనం భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. కాగా, బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి రూ.3.84 కోట్లు ఆదాయం లభించినట్లు శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 56,952 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 21,714 మంది తలనీలాలు సమర్పించారు.

త్వరలో జైలుకు ముగ్గురు వైపీసీ నేతలు

సమస్యల పరిష్కారానికి మండలాల వారీగా ప్రత్యేక సిబ్బంది ● ఎమ్మెల్యే సుధీర్ వెల్లడి

శ్రీకాళహస్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అక్రమార్కులను త్వరలోనే జైలుకు పంపుతామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ల జాబితాను విడుదల చేసిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్లపాటు సాగించిన దుర్మార్గాలను వెలికి తీస్తున్నట్లు చెప్పారు. మరో మూడు రోజుల్లోనే ముగ్గురు వైసీపీ నాయకులు జైలుకు వెళ్లబోతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణానికి మనోజ్ కుమార్‌ను 94917 06316 నెంబరులో సంప్రదించాలని సూచించారు. అలాగే శ్రీకాళహస్తి మండలానికి మణెమ్మ (70321 78191), తొట్టంబేడుకు భారతి (91820 31426), ఏర్పేడుకు హేమ (94418 55838), రేణిగుంటకు సుజాత (83670 90320)ను నియమించామన్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్నా.. చనిపోతున్నా..!

తిరుమల నుంచి సెల్ఫీ వీడియో పంపిన యువతి ● పోలీసులను ఆశ్రయించిన సోదరుడు ● గంట వ్యవధిలోనే యువతిని గుర్తించిన టూటౌన్ పోలీసులు

తిరుమల, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తన భర్తతో జరిగిన గొడవ కారణంగా తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానంటూ ఓ యువతి తిరుమల నుంచి తన అన్నకు వీడియో పంపింది. దీనిపై అతడు నిమిషాల వ్యవధిలో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. గంట వ్యవధిలోనే ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తమిళనాడులోని హోసూర్‌కు చెందిన శంకర్, భావన దంపతులకు ఇద్దరు పిల్లలు. భర్తతో జరిగిన గొడవ కారణంగా గురువారం రాత్రి ఆమె ఇంటి నుంచి తిరుమలకు బయలుదేరింది. శుక్రవారం ఉదయం ఆమె శ్రీవారిమెట్టు మార్గం నుంచి 'నా భర్తతో గొడవ జరిగింది. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నా' అంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేసి వాట్సాప్ ద్వారా బెంగుళూరులోని తన అన్న ప్రసాద్‌కు పంపింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఫోను చేసినా ఈమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఉదయం పదిన్నర గంటల సమయంలో కంట్రోల్ రూమ్ నుంచి తిరుమల పోలీసులను ప్రసాద్ ఆశ్రయించి, తన చెల్లిని కాపాడాలని కోరారు. వెంటనే టూటౌన్ సీఐ శ్రీరాముడు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆ సెల్ఫీ వీడియో సాయంట భావన కదలికలపై సీసీ కెమెరాల ఫుటేజ్, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిఘా పెట్టి.. గాలించారు. 11.30 గంటల సమయంలో తిరుమలలోని ఎస్వీ గెస్ట్ హౌస్ వద్ద భావనను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారికి ఆమెను అప్పగించి.. ఆ యువతికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.



యువతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

మంగళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జిల్లాలో 2,64,636 మంది లబ్ధిదారులకు గానూ రూ.112.25 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు ఇంటికి వస్తారని, అందుబాటులో ఉండి పెన్షన్ తీసుకోవాలని సూచించారు. రెండు నెలలు తీసుకోకపోయినా మూడో నెలలో ఒకేసారి మొత్తం చెల్లిస్తారని తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని సూచించారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో..
ఏడుగురికి ఆరేళ్ల జైలుశిక్ష

రూ.6 లక్షల చొప్పున జరిమానా

మంగళం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ ఏడుగురికి ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఆరేళ్ల జైలుశిక్ష, ఆరు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. 2017లో కరకంబాడి బీట్ టీఎన్‌పాలెం సెక్షన్‌లో పట్టుబడిన కేసులో ఏడుగురు ముద్దాయిలకు శిక్ష పడినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాకు చెందిన అద్దంకి గంగాధరం, తుపాకుల గంగాధరం, తుపాకుల శ్రీనివాసులు, గుండ్రాళ్ల మునయ్య, పాముల నాగయ్య, టీ.బంగారయ్య, తమిళనాడుకు చెందిన కె.మురగయ్యలు ఇందులో ఉన్నారన్నారు. శేషాచల అడవుల్లోని ఎర్రచందనాన్ని నరికి అక్రమంగా తరలించే నేరస్తులకు శిక్ష తప్పదని హెచ్చరించారు.

'డ్రగ్స్ ఆరోపణలు అవాస్తవం'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో డ్రగ్స్ వినియోగిస్తున్నారని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని రిజిస్ట్రార్ ఆర్.జె.రమాశ్రీ పేర్కొన్నారు. అనుమానం కల్గిన ఇద్దరు విద్యార్థులకు రుయాలో వైద్య పరీక్షలు చేయించామన్నారు. వారు డ్రగ్స్ వాడలేదని రుయా నివేదిక ద్వారా స్పష్టమైందన్నారు. ఆరోపణలు వచ్చిన విద్యార్థులను తల్లిదండ్రుల చెంతకు పంపి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నామన్నారు. విద్యార్థుల పట్ల మరింత పర్యవేక్షణ ఉంచి, క్రమశిక్షణతో సన్మార్గంలో నడిపించాలని నిర్ణయించామన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే జనవాణి



జనవాణి కార్యక్రమంలో జనసేన నేతలు

గూడూరు అర్బన్, నవంబరు (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలను సమస్యలను పరిష్కరించేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టినట్లు ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ తదితర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించేలా జనసేన చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సాయికిరణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెల్త్ అసిస్టెంట్ మృతి



ప్రభాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఓజిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలికి చెందిన వైద్య ఉద్యోగి (హెల్త్ అసిస్టెంట్) బల్లి ప్రభాకర్ (51) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. నాయుడుపేట మండలం గొట్టిప్రోలు పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆయనకు శుక్రవారం ఉదయం గుండె పోటు వచ్చింది. వెంటనే నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రభాకర్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామం ఓజిలికి తీసుకు వచ్చారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఓజిలి, గొట్టిప్రోలు వైద్యులు డానియేల్ రాజ్, వికాస్, శంకరయ్యతో పాటు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, నాయుడుపేట తాలూకా అధ్యక్షుడు కన్నా వెంకటగోపాల్, టీడీపీ నాయకులు కనుమూరు గోపాల్‌రెడ్డి, ఎద్దల ధనుం జయరెడ్డి తదితరులు ప్రభాకర్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

తడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని వాటంబేడు గ్రామానికి చెందిన పాలవాక్కం రవి(58) కొంత కాలంగా ఎడమచేయ్యి నొప్పితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ సైతం చేయించుకున్నాడు. అప్పటి నుంచి బరువైన వస్తువులను చేతులతో ఎత్తకూడదని డాక్టర్లు సలహా ఇచ్చారు. బుధవారం తన పొలంలో పనిచేసేందుకు కూలీలు రాకపోయే సరికి యూరియా బస్తాని తానే మోసుకెళ్లాడు. దీంతో ఎడమ చేయ్యి నొప్పి తీవ్రమైంది. భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో బయటకెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి అపస్మారకస్థితిలో ఉండటంతో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాల సీజ్



ఎరువులను తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

కోట, వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలను సీజ్ చేస్తామని వెంకటగిరి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగార్జున సాగర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కోట పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను స్థానిక ఏవో నిరంజన్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో ఎరువులను పరిశీలించారు. కొన్ని ఎరువుల నాణ్యత పరిశీలనకు నమూనాలను సేకరించారు. రెండు దుకాణాల్లో ఓఫారంలు, లైసెన్స్ నమోదు కాకపోవడంతో ఎరువుల అమ్మకాలను వెంటనే నిలిపి వేయాలని ఆదేశించారు.ఓఫారంలు ఖచ్చితంగా డీలర్ల వద్ద ఉండాలన్నారు. ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించడంతో పాటు బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే నిల్వలు, ధరలను స్టాక్‌బోర్డులో చూపాలన్నారు. నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ● వాకాడుని ఎరువుల దుకాణాల్లో వెంకటగిరి సహాయ వ్యవసాయ సంచాలకుడు నాగార్జునసాగర్, మండల వ్యవసాయశాఖ అధికారిణి దీప తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులను కొన్న రైతులకు డీలర్లు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. స్టాక్, బిల్ పుస్తకాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. స్టాక్‌కు సంబంధించినటువంటి జీరో ఫారాలు తప్పనిసరిగా లైసెన్స్‌లో పొందుపరుచుకోవాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

జీఎస్టీ చెల్లింపులపై అవగాహన కలిగివుండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అరుణకుమారి

గూడూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ చెల్లింపులపై వ్యాపారస్థులందరూ అవగాహన కలిగివుండాలని వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ అరుణకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో వ్యాపారస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారస్థులందరూ తమ సంస్థలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. జీఎస్టీ కలిగిన వారు తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రమీల, సోమిశెట్టి చెంచురామయ్య, చంద్రశేఖర్, కోట సునీల్‌కుమార్, సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌కు ఆరేళ్ల చిన్నారి

నాయుడుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన తండ్రి.. బిడ్డను విడిచివెళ్లిపోయిన తల్లి.. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆరేళ్ల చిన్నారిని నాయుడుపేట అర్బన్ సీఐ బాబి ఐసీడీఎస్ అధికారిరులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.... నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో ఆరేళ్ల చిన్నారి దిక్కుతోచని స్థితిలో ఉండడాన్ని స్థానికులు గమనించి సీఐకి సమాచారం అందించారు. సీఐ బాబి సంఘటనాస్థలికి చేరుకున్న మద్యం మత్తులో ఉన్న తండ్రి పక్కన కూర్చొని దిక్కులు చూస్తున్న చిన్నారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. అనంతరం ఆ చిన్నారిని గూడూరులోని బాలసదన్‌కు తరలించారు.

తీరం.. అల్లకల్లోలం

వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. రెండు రోజులుగా కెరటాలు తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం ఎడతెరపిలేకుండా కురుస్తుండటం, చల్లటి గాలులతో కూడిన ముసురు కమ్ముకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధి కారుల సూచనలతో తహసీల్దారు రామయ్య, మండలస్థాయి అధికారులకు తుఫాన్ పట్ల దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ సిబ్బంది తీరప్రాంత గ్రామాల ప్రజలను, రైతులను అప్రమత్తం చేస్తున్నారన్నారు. ఎక్కడ ఏ చిన్నసంఘటన జరిగినా తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, వాగులు, వంకలు, చెరువు, నదిపరి వాహక ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండలంలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నామని తహసీల్దారు చెప్పారు.

సముద్రంలో అలల అలజడి

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారి తీరం దాటనున్న నేపథ్యంలో సముద్రంలో పొద్దు పోయిన తరువాత అలల ఉధృతి పెరిగింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కోట మండలం గోవింద పల్లి పాళెం, శ్రీనివాసపురం గ్రామాల్లో తహసీల్దారు జయ జయరావు సందర్శించి మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. వీఆర్వోలను పంచాయతీ కేంద్రాల్లో అందు బాటులో ఉండి అవసరమైతే నిత్యవసర సరుకులను పంపిణీకి సిద్ధం చేయాలని తహసీల్దారు కోరారు. మత్స్యకారులు సముద్రం లోకి వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉంటే సాయంత్రం వరకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఉన్న సముద్రంలో ఒక్కసారిగా అలల ఉధృతి పెరిగి ఉరకలేసింది. చిన్నపాటి శబ్దాలు చేస్తూ అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ ఉన్నాయి. దీంతో సముద్ర తీర మత్స్యకార గ్రామాలు భయంగుప్పెట్లో ఉన్నాయి.

పులికాట్‌లో చేపల వేటకు వెళ్లొద్దు

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రాంతంలో ఇప్పటి వరకు తుఫాన్ ప్రభావం అంతగా లేదు. ఈదురు గాలులు వీయడంతో పాటు భారీ వర్ష సూచనతో పులికాట్ సరస్సులో మత్స్యకారులు వేటకు వెళ్లదని అధికారులు హెచ్చరించారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి నేతృత్వంలో డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకొని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షం కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిరు జల్లులు.. చలి గాలులు



సూళ్లూరుపేటలో బాలికల పాఠశాల వద్ద రోడ్డుపై గుంతల్లో వర్షపునీరు

సూళ్లూరుపేట, నాయుడుపేట, ఓజిలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో సూళ్లూరుపేటలో శుక్రవారం ఉదయం నుంచే చలి గాలులతో కూడిన చిరు జల్లులు కురిశాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయంగా మారాయి. మరమ్మతులు చేసేందుకు జీఎస్‌టీ రోడ్డును తవ్వేయడంతో వర్షపు నీరు నిలబడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్నాహ్నం కాస్త తెరిపిచ్చినా మళ్లీ సాయంత్రం 6 గంటల నుంచి జల్లులతో కూడిన వర్షం కురిసింది. ● నాయుడుపేటలో చలిగాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. రెవెన్యూ అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న వారితో మాట్లాడారు. వర్షం ఎక్కువైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ● ఓజిలి మండలంలో శుక్రవారం చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. రోజంతా దట్టమైన మబ్బులతో చలి వాతావరణం నెలకొంది.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటిల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అజెండాలో పలు అంశాలకు సంబంధించి ముందుస్తు అనుమతులు ఇవ్వడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లను సంప్రదించకుండా అజెండాను కౌన్సిల్ అనుమతి కోసం ఎలా ప్రవేశ పెడతారని చైర్‌పర్సన్‌ను నిలదీశారు. అంతే కాకుండా ప్రతి నెలా నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశాలను మూడు నెలల కోసారి మొక్కుబడిగా నిర్వహిస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవ్వరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య మాట్లాడుతూ ప్రతి నెలా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని ఎమ్మెల్యేతో పాటు సొంత పార్టీ కౌన్సిలర్లు చెప్పినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇంతకీ చైర్‌పర్సన్ ఏ పార్టీ వారో చెప్పాలంటూ కౌన్సిలర్లు పట్టుబట్టారు. ఈ క్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ పూజారి లక్ష్మి, 9వ వార్డు కౌన్సిలర్లు కందాటి కల్యాణి జోక్యం చేసుకొంటూ చైర్‌పర్సన్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పడంతో కౌన్సిలర్ల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఇంతలో ఎమ్మెల్యే రామకృష్ణ జోక్యం చేసుకొని ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని, తాను కూడా సమావేశాల్లో పాల్గొంటానని చెప్పారు. కౌన్సిలర్లు అసందర్భ విషయాలపై వాగ్వావాగాలకు దిగడం మాని మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఇక కౌన్సిలర్లకు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని అధికారులకు సూచించారు. త్వరలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణతో చర్చించి మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తామని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల రాజేష్, కొండలరావు

దొరవారిసత్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయడానికి నాయకులందరూ సమష్టిగా కృషి చేయాలని సూళ్లూరుపేట నియోజవర్గ పరిశీలకుడు కొండలరావు సూచించారు. శుక్రవారం ఆయన దొరవారిసత్రంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, నెలవల రాజేష్‌తో కలసి సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు మందకోడిగా సాగుతోందని, పార్టీ ఆదేశాల మేరకు 10వేల సభ్యత్వాలు పూర్తి చేయాలని కోరారు. సూళ్లూరుపేట నియోజవర్గంలో 80వేల సభ్యత్వాలు లక్ష్యం కాగా, దొరవారిసత్రం మండలంలో 10 వేలకు తగ్గకుండా చేయాలని నెలవల రాజేష్ అన్నారు. కల్లూరు గ్రామ నాయకుడు ఇట్టగుంట మల్లేయ్య మాట్లాడుతూ... మండలంలో సీనియర్ నాయకులకు ప్రాధాన్యం లేదని, తమ గ్రామంలో వైసీపీ నుంచి వచ్చిన వారికి సిమెంటు రోడ్డు పనులు ఇవ్వడం, ఆయన వైసీపీ నాయకులతో కలిసి భూమిపూజ చేయడంపై ప్రశ్నించారు. నెలవల రాజేష్ స్పందిస్తూ మండలంలో లోటుపాట్లు ఉన్నాయని, అందరికి సమన్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మండల ప్రధాన్య కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు జకరయ్య, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షబ్బీర్, ఉదయ్, గోపాల్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, వెంకట్, రాధయ్య, రత్నయ్య, మల్లేయ్య చెంగయ్య, రమేష్, కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టండి

చిల్లకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలని మండల ప్రత్యేక అధికారి నందకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు సకాలంలో సక్రమంగా అందించాలన్నారు. శనివారం వందశాతం పెన్షన్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ ఇలియాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుమన్, ఈవోపీఆర్‌డీ సిరాజ్, పలు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీహరికోట విద్యార్థి ప్రతిభ



జమ్ములో నిర్వాహకుల నుంచి సర్టిఫికెట్ అందుకొంటున్న విద్యార్థి శ్రీవిష్ యాదవ్

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆఫ్ జమ్ములో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల ఏడో తరగతి విద్యార్థి బిట్రగుంట శ్రీవిష్ యాదవ్ ప్రతిభ కనబరిచాడు. 22 రాష్ట్రాల నుంచి దాదాపు 450 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 15 విభాగంలో శ్రీవిష్ యాదవ్ బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకొన్నాడు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి ప్రోత్సాహంతో శ్రీవిష్ యాదవ్ జాతీయ స్థాయిలో రాణించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థి శ్రీవిష్ యాదవ్‌ను ఉపాధ్యాయులు శ్రీనివాసగాంధీ, శిక్షణ ఇచ్చిన సుమిత్ కుమార్ యాదవ్ అభినందించారు.

హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు

గూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేద్దామని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. హెచ్‌ఐవీ వల్ల కలిగే అనర్థాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివరించి చైతన్య పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, విజయ్‌మహేష్, కిరణ్మయి, నారాయణరాజు, వాణి, సురేంద్ర, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

గూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తేదీన తిరుపతి వైఖానస కల్యాణ మండపంలో నిర్వహించే వివాహ పరిచయ వేదికను బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని గూడూరు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవాసంఘం సభ్యుడు బాలాజీ కోరారు. వివరాలకు 9949339851, 9494415229 నంబర్లను సంప్రదించాలన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శైలజ

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని, ఇందులో ప్రధానోపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలని ఎంఈవోలు శైలజ, మస్తానయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ డిసెంబరు 7న ప్రతి పాఠశాలలో తేదీ మెగా పేరెంట్స్ సమావేశాలు విధిగా జరపాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి పలు పథకాల నుంచి నిధులు వస్తాయని, వాటి వినియోగంలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములు చేయాలన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



కేశవరంలో అంగన్‌వాడీ వర్కర్ల మానవహారం

కోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనలో అంగన్‌వాడీ వర్కర్లు కీలకపాత్ర పోషించాలని సీడీపీవో మునికుమారి కోరారు. మండల పరిధిలోని కేశవరంలో శుక్రవారం సెక్టార్ సమావేశాలు జరిగాయి. బాల్య వివాహాలు, నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా వర్కర్లు, కిశోర బాలికలు, తల్లులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కేశవరంలోని ప్రధాన కూడలివద్ద సూపర్ వైజర్ కవిత ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను స్థానికులకు వివరించారు.

ప్రధానోపాధ్యాయులకు అవగాహన



కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులకు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిసెంబరు 7న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఎంఈవో శ్రీనివాసులు, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

గూడూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించకుండా వాహనాలు కఠిన చర్యలు చేపడుతామని ఏఎంవీఐ శాంతి అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పవరప్పాడు జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా ధృవీకరణ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కరిముల్లా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ కల్యాణ్



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి

గూడూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడును ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు ఉత్తరక్రియలకు వచ్చిన సీఎం చంద్ర బాబు శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యారు. రేణిగుంట విమానాశ్రయంలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు.

శివుడికి అన్నాభిషేకం



సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివుడికి అన్నాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సునీల్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన అన్నాభిషేక కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కర్లపూడి రమేష్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి...



కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడు, కోటలోని కామాక్షీదేవి సమేత సోమేశ్వరుడి ఆలయాల్లో శుక్రవారం కార్తీకమాస పూజలు జరిగాయి. కోటలోని సోమేశ్వరుడికి అభిషేకాలు చేశారు. స్వామివారి మూల విరాట్‌కు అన్నం, పండ్లు, లడ్డూలతో అభిషేకాలు చేసి అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉదయం విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు వీడ్కోలు పలికారు.